ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

అక్టోబర్ 25, 2015

తెలుగు తెర వెలుగు రేఖ

వైకల్యాన్ని ఓడించి...

Doha 2015

IPC Athletics World Championships

ఆమె... చేతి చిత్రాలు

రేవతి

శ్రీ ప్రియ

అలనాటి అగ్ర తారలు సావిత్రి, భానుమతి నటనా పాఠ్యగ్రంథాలు. దర్శకులుగాను గొప్ప కావ్యాలను తెరకెక్కించారు. వారి స్ఫూర్తితో మహిళలు డైరెక్టర్లుగా రాణిస్తూ తమదైన ముద్ర వేస్తూనే ఉన్నారు. విజయనిర్మల అత్యధికంగా 44 చిత్రాలకు దర్శకత్వం వహించి గిన్నిస్ రికార్డు నెలకొల్పారు. నిన్నటి తరం హీరోయిన్లుగా హిట్లు కొట్టిన శ్రీప్రియ, రేవతి కూడా దర్శకత్వంతో కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించారు. శ్రీప్రియ 'దృశ్యం'తో విమర్శకుల్ని మెప్పిస్తే, రేవతి ఇంగ్లీష్, హిందీలో ఇప్పటికే కొన్ని ఫీచర్ ఫిల్మ్స్, షార్ట్ ఫిల్మ్స్‌కు దర్శకత్వం వహించి గుర్తింపు తెచ్చుకున్నారు. త్వరలో దక్షిణాది భాషల్లో పూర్తిస్థాయి చలన చిత్రానికి దర్శకత్వం వహించబోతున్నారు. పూర్తిగా దర్శకత్వ శాఖకే అంకితమైన బి.జయ రూపంలో విజయ నిర్మల తర్వాత మరో కమర్షియల్ లేడీ డైరెక్టర్ రంగప్రవేశం చేశారు. 'చంటిగాడు' సినిమాతో హిట్ కొట్టి నిన్నటి 'లవ్లీ' సినిమా వరకు తెరకెక్కిస్తూ యాక్టివ్‌గానే ఉంటున్నారు. నందినీ రెడ్డి 'అలా మొదలైంది' చిత్రంతో అద్భుతాన్ని అందించారు. ఆమె తర్వాత ఇప్పుడు మరో టాలీవుడ్ మహిళా దర్శకురాలు చునియా పరిచయం కాబోతున్నారు. అన్నపూర్ణ బ్యానర్‌లో తెరకెక్కబోతోన్న సినిమా అని వార్తలు వచ్చాయి. సినిమా రంగంలోకి రాకముందు 'యువ' అనే తెలుగు సీరియల్‌కు దర్శకత్వం వహించారు చునియా. పొరుగు సినీ ఇండస్ట్రీకి చెందిన దర్శకురాలు మధుమతి తెలుగులోను మార్క్ వేసేందుకు ప్రయత్నిస్తోంది. తన షార్ట్‌ఫిల్మ్‌లతో బీబీసీ అంతర్జాతీయ అవార్డులను గెలుచుకుని, 'పైరేట్స్ ఆఫ్ ది కరీబియన్' హాలీవుడ్ సినిమా సిరీస్‌లోని చిత్రానికి పనిచేసిన ఆమె 'మూడు ముక్కల్లో చెప్పాలంటే' అనే చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం కాబోతున్నారు.

నందినీ రెడ్డి

బి.జయ

చునియా

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

కందిపప్పు కష్టాలు

ముందుగా గుండెల నిండా ప్రశాంతంగా గాలి పీల్చుకోవాలి. బీపీ సుగర్ లాంటివి అదుపులో వున్నాయో లేవో సరి చూసుకోవాలి. మానసిక ఒత్తిడికి గురికాకుండా మనసును ఆహ్లాదంగా వుంచుకోవాలి. ఇదేదో యోగా తరగతుల్లో గురువులు చెప్తున్న మాటలు కావు. మార్కెట్టుకు సరుకులు కొనేందుకు వెళ్లే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు. లేకపోతే గుండెలు గుభేల్ మనే ప్రమాదం వుంది. మరి కందిపప్పు ధరలు డబుల్ సెంచరీలు (కేజీ 200 రూపాయలు) చేసేస్తుంటే ఆ మాత్రం జాగ్రత్తలు పాటించొద్దూ.

కందిపప్పుకు కామన్‌మేన్‌కు వున్న అవినాభావ సంబంధం అలాంటిది. కూరగాయల ధరలు చుక్కలనంటుతున్న వేళ ఇల్లాలిని ఆదుకునేది కందిపప్పే. పెరటి తోటకూర కోసి కాసిని పప్పులో వేసి ఉడకేస్తే ఆ పూటకు కూర సమస్య తీరిపోతుంది. తోటకూర లేకపోయినా నాలుగు ఎండు మిర్చి, కందిపప్పు వేయించేసి, వెల్లుల్లి, కొత్తిమీర జోడించి నూరేస్తే... నోరూరించే కంది పచ్చడి ఇంటిల్లపాదినీ ఆకట్టుకుంటుంది. పెద్ద ఉసిరి కాయంత చింత పండుతో చట్టి నిండా పప్పు చారు పెట్టేస్తే కుటుంబ సభ్యులంతా నోరు మెదపకుండా తినేస్తారు. ఇవేవీ కాకపోయినా... చప్పిడిపప్పు చేసేసి మామిడికాయ పచ్చడితో ఒడ్డిస్తే లొట్టలు వేసుకుంటూ లాగించేస్తారు. అలాంటి కందిపప్పు ధర ఇవాళ చికెన్ రేటును మించిపోతే ఏం తినేట్టు...ఏం కొనేట్టు! రోజూ చికెన్ తినలేం కదా!

◆ మనలో మాట

నిన్నటి దాకా ఉల్లి ఘాటుతో ఉక్కిరి బిక్కిరి అయిన జనం ఇవాళ కందిబొబ్బలతో కందిపోతున్నారు. పప్పు జోలికి పోవడానికే జంకుతున్నారు. ఉడకని పప్పుతో ఊసులెందుకంటున్నారు. ఒకవేళ ధైర్యం చేసి పప్పు చారు చేసినా పప్పు వాసన తగలడంలా. ఒట్టి చింతపండు నీళ్ల చారే. పండగ నాడు కూడా పప్పు లేని పాయసంతోనే సరిపుచ్చుకోవాల్సి వస్తోంది.

ఓట్లు గుద్ది గద్దెనెక్కిస్తే నిత్యావసరాల ధరలు తగ్గిస్తామని కోతలు కోసిన పాలకులు.. తీరా కుర్చీ అధిష్టించాక ఆ మాటే మరిచారు. ఇదేముంది! చాలా మాటలు చెప్పారు. తర్వాత మరిచారు. రాజధాని రందిలో పడిన మన ముఖ్యమంత్రి సైతం సామాన్యుడికి తగిలిన కందిపోటు గురించి మర్చిపోయారు. పొరుగు ముఖ్యమంత్రి జయమ్మే నయం. సబ్సిడీ కింద అమ్మ కందిపప్పు ఇప్పిస్తోంది. తమిళ తంబీలు సాంబారు ఇడ్లీ ప్రియులు కనక పురుచ్చితలైవి ఆ నిర్ణయం తీసుకుంది. తెలుగు వారికీ పప్పు ప్రీతిపాత్రమైన వంటకమే కనక 'బాబు పప్పు' అనో, 'అన్న పప్పు' అనో సబ్సిడీ కందిపప్పు ఇప్పిస్తే సొమ్మేం పోతుందట? కార్పొరేట్లకు కోట్లు కట్టబెట్టేకంటే కటికపేదలకు కందిపప్పు ఇస్తే పొయ్యేదేం వుండదు!.

■



టపా

ఎన్నో విషయాలు

రవాణా సౌకర్యం కోసం ప్రపంచంలో మహా పర్వతాలను తొలిచి, భూజల అంతర్భాగంలో నిర్మించిన ఎన్నో సొరంగ మార్గాల ఉన్నత ప్రమాణాల గురించి చదువుతుంటే ఎన్నో విషయాలను తెలుసుకుంటున్నట్లు ఉంది. రాజస్థాన్ గ్రామాల్లోని స్త్రీల నీటి భారాన్ని తగ్గించిన పుల్లే బ్రేక్, వాటర్ వీల్ టెక్నిక్స్ బాగున్నాయి. నెదర్లాండ్‌లో వృద్ధుల మతిమరుపు జబ్బును నయం చేస్తున్న చికిత్సాలయం పని తీరు విచిత్రంగా ఉంది. మూగ మనసులు సినిమాలో గోదావరి అందాలను చూపించిన ఆదుర్తి సుబ్బారావు గారి బాటలో ఆ తరువాత ఎందరో నడిచారు.

టి.సత్యనారాయణ మూర్తి, మల్కాపురం, విశాఖపట్నం

అందమైన చేతిరాత

ఎన్ని తరాలు మారినా చేతిరాతకు ఉండే ప్రాముఖ్యత ఎన్నటికి తగ్గదు. ఎన్నో రంగాలు ఉన్నప్పటికి వీడ్ మన్ ఈ రంగాన్ని ఎంచుకోవటం గర్వించదగ్గ విషయం. తనకంటూ ఓ ప్రత్యేకతను ఏర్పరుచుకోవడంలో తను చేసిన కృషి నేటి యువతకు ఆదర్శప్రాయంగా నిలుస్తుందని ఆశిస్తున్నాను. రాజస్థాన్ వాసులు నీటి కోసం కొన్ని వేల కిలోమీటర్లు నడుచు కుంటూ వెళ్ళి నీటిని తెచ్చుకోవడమే వారి ప్రధాన సమస్య. నీటి కోసం బహు భార్యత్వమ్ నేటికి కొనసాగుతూనే ఉంది. వారి కోసం సహాయపడటం బాగుంది.

వేణు, విశాఖపట్నం

బుజ్జాయిల చదువుకోసం ...

మన ప్రభుత్వాలు చదువు కోసం ఎంతో ఖర్చు పెడుతున్నాయి. అయినప్పటికి స్కూల్ డ్రాపవుట్లు తప్పట్లేదు. అబ్దుల్ మాలిక్ అనే అధ్యాపకుడు పిల్లల చదువు కోసం రోజు నదిని దాటుతూ వారికి పాఠాలు చెప్పడం చాలా గొప్ప విషయం. పేదల బాగు కోసం అంకిత భావంతో చేసే ఏ పని అయిన ఫల ప్రదం అవుతుంది అని చెప్పడానికి బడికి ఈత బాట ఒక చక్కని ఉదాహరణ.

మోహన్, త్రిపురవరం, కమలాపురం, కడప

వింతే మరి

మనిషికి జీవితంలో అన్ని దశల కంటే చివరి దశ చాలా కష్టమైనది. ఆ దశలో మతిమరుపు రావడం దారుణం. ఇటువంటి వారి కోసం ప్రత్యేకంగా ఒక గ్రామాన్ని నిర్మించి సేవలు అందించే వారికి అభినందనలు. బొమ్మల దీవి చాలా బాగుంది. ప్రతి కొమ్మకి ఒక ఆకారం ఎంతో వింతగా ఉంది.

బొడ్డేపల్లి కనకలక్ష్మి, పూజారి పేట, ఆముదాల వలస, శ్రీకాకుళం.

సర్కారు దవాఖానా... మజాకా...

వైద్యో నారాయణో హరి అన్నారు మన పెద్దలు. నేటి పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి మన ప్రభుత్వ ఆసుపత్రులు. వైద్యానికి వచ్చిన రోగికి పూర్తిగా నయం అవుతుందన్న నమ్మకం లేకపోగా కొత్తగా ఏ జబ్బులు వస్తాయో అని బిక్కుబిక్కుమంటూ గడుపుతుంటే, మరొక వైపు ఏ రంధ్రం నుంచి ఎలుక, పాము, పందులు వస్తాయోనని భయపడుతూ గడపవలసి వస్తోంది. మన కాంట్రాక్టర్లు చావు కబురు చల్లగా చెప్పినట్టు ఎలుకలను పట్టుకోవడం తమ వల్ల కాదన్నారు. ప్రజలను కాపాడే నాయకుల సంగతి సరేసరి. ఈ విషయం ముందుమాటలో చర్చించడం బాగుంది.

- రాము, కడప

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ. -520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

వైకల్యాన్ని ఓడించి...

కవర్ స్టోరీ — 6

అదో క్రీడా సంగ్రామం. వైకల్యాన్ని దారుణంగా ఓడించి... కసిగా కదం తొక్కే ధీరులు బరిలోకి దిగే అసలు సిసలు పోరు. పారా అథ్లెట్ల శక్తి పాటవాలకు మైదానమంతా మోకరిల్లుతూ వారి విజయ గాథల్ని గర్వంగా ట్రాక్ ఎక్కించే పారాలింపిక్ అథ్లెటిక్స్ వరల్డ్ చాంపియన్‌షిప్పే దాని పేరు. బలహీనత అనే మాటను దూరంగా విసిరేస్తూ.. వైకల్యం అనే పోటును అడుగు కింద నలిపేస్తూ.. సాగే ఆ క్రీడా వీరుల స్వేదంతో తడిసి ఫీల్డ్ పులకిస్తుంది.



స్ఫూర్తి 3
కెరటాలపై నడక
యువ 4
పొడవు కాళ్ల సుందరి
కార్టూన్ పంచ్ 5
ప్రత్యేకం 10
ఏం బాబూ వజ్రం కావాలా?
నవ్వుల్ పువ్వుల్ 11
సినిమా కబుర్లు 14
తెలుగు తెర వెలుగు రేఖ
వింత లోకం 16
తూచ్...పెళ్లిళ్లు
లఘుచిత్రం 17
ఆలోచింపచేసే 'ఒక మరణం'
కథ 18
ఎందుకు పారేస్తాను నాన్నా?
రుచి 21
రొయ్యలతో రకరకాలు
బాల నేస్తాలు 22
ఏ రంగు కళ్లు?
కొత్త పుస్తకాలు 24
ఒక పుస్తకం రెండు పార్శ్వాలు

చరిత్రలో ఒకరోజు -12
అశ్వాన్ని అధిరోహించి... పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి.....

ఉవ్వెత్తున ఎగసే కెరటాలపై కడలిని తాకుతూ ఆడే సాహస క్రీడే సర్ఫింగ్ అంటే ఇషితా మాలవ్యా ఒప్పుకోదు. సంద్రాన్ని హత్తుకుని స్నేహం కట్టే అలలాటని చెబుతుందీ భారత్ తొలి మహిళా సర్ఫర్. సాగరంతో ప్రేమలో పడి తడిసిముద్దవుతున్న యువ తరంగం ఇషితా ఇప్పుడో సర్ఫర్ల తెగకు సారథి.

కెరటాలపై నడక

ఇషితా

ముంబైలోనూ సముద్రం ఉంది. కానీ, హోరెత్తే ఆ మహా నగర రొదలకు దూరంగా మనసు తేలిగ్గా విహరించగలిగే చోటుకు పారిపోవాలని ఇషితా చిన్ననాటి నుంచే కలలు కనేది. ప్రకృతికి అనుసంధానమయ్యే చోటు వెతుక్కుంటూ మణిపాల్ చేరుకుంది. వంక చదువుపేరిటే అయినా విషయం మాత్రం కాలం తెలీని కడలి తీరంలో చక్కర్లు. ఎంతసేపూ ఒడ్డునే కాలం గడిపితే ఎట్లా ఆ నీటి సడి ఏం చెబుతుందో దగ్గరి నుంచి వినాలనుండేది ఆమెకు. టీవీలోనో, సినిమాలోనో కనిపించే సర్ఫర్లను చూసి బోలెడంత అసూయ పెంచుకుంది. కాలిఫోర్నియా, హవాయి, మాలి వంటి చోట్ల వందల మంది నిత్యం సముద్రంతో ఆడే ఆ ఆటలో పాల్గొనే అదృష్టం ఈ జీవితంలో లేదని అనుకునేది. దేశంలోని 7517 కిలోమీటర్ల కోస్తా ప్రాంతంలో సర్ఫింగ్‌తో కళకళలాడే చోటే లేదని బాధపడేది. మనం బలంగా సంకల్పించింది నెరవేర్చేందుకు ప్రపంచమంతా కలిసి కుట్ర పన్నుతుందని పాలో కొయిలో అన్నమాట నిజమైనట్టు తాను చదివే మణిపాల్ కళాశాలలో ఓ జర్మన్ కల్చరల్ ఎక్స్ఛేంజ్ విద్యార్థి మిత్రుడయ్యాడు. అతడు వస్తూ వస్తూ తన సర్ఫింగ్ బోర్డ్‌ను తెచ్చుకున్నాడు. ఇంకేముంది తన చిన్నప్పటి స్నేహితుడు తుషార్ పాతియాన్‌తో కలిసి వీలు చిక్కినప్పుడల్లా దగ్గరిలోని బీచ్‌కు పరుగులు తీసేది. ఆ స్నేహితుల్ని ఎగిరి గంతేసేలా చేసింది. కర్నాటకలోని ముల్కీకి కాలిఫోర్నియా నుంచి వచ్చిన ఓ సన్యాసుల బృందం మంచి సర్ఫింగ్ క్రీడాకారులని తెలుసుకుని వెంటనే అక్కడ వాలిపోయారు. సర్ఫింగ్ స్వామీస్‌గా తమను తాము పిలుచుకునే వాళ్లు ఇషితాకు సర్ఫింగ్ పాఠాలు చెప్పేందుకు ఒప్పుకున్నారు. అలా 2007లో మొదలైన ఇషిత అలల ప్రయాణం అనేక ఆటుపోట్లుల్ని చూసింది. బొత్తిగా కొత్త క్రీడ కావడం, సర్ఫింగ్ దుస్తుల తీరు, సముద్రంతో చెలగాటం కావడం, ఒంటరి తర్ఫీదు వంటి అనేక కారణాలతో తల్లిదండ్రులు నిరుత్సాహపరిచారు. వారి అభిమతానికి వ్యతిరేకంగా తుషార్‌తో కలిసి ఇషితా సర్ఫింగ్ కోసమని కర్నాటకలోని మత్స్యకార గ్రామం కోడీ బెంగ్రెకు మకాం మార్చింది. అక్కడి కెరటాలు సర్ఫింగ్‌కు అనుకులంగా ఉండటంతో తన శిక్షణకు దాన్నే స్థిరపరుచుకుంది. సర్ఫింగ్ బోర్డు విదేశాల నుంచి తెప్పించుకునేందుకు డబ్బు లేక ఉన్న వస్తువులన్నీ అమ్మేశారు. కేవలం నిత్యావసరాలకు సరిపడా వస్తువులు మాత్రమే మిగుల్చుకున్నారు. సొంత బోర్డ్ అనే భావన ఆమెను ఎంతో ఉద్వేగానికి గురిచేసింది. ఆ ఒక్క బోర్డుతో రెండేళ్ల పాటు ఇద్దరూ మెళుకువలు నేర్చుకున్నారు. విదేశాల



నుంచి వచ్చే సర్ఫర్లతో పరిచయాలు ఆమెను దేశంలోని సర్ఫింగ్ హాట్‌స్పాట్‌లన్ని చుట్టొచ్చేలా చేశాయి. ఎక్కడికెళ్లినా బహుశా నువ్వే మన తొలి సర్ఫర్ అమ్మాయివేమో అనే మాట ఆమెకు ఉత్తేజాన్నిచ్చేది. ఆమె బోర్డుతో తీరాలన్నింటినీ చుట్టే సమయానికి దేశం మొత్తంలో రెండు వైపులా ఉన్న తీరాల్లో అక్కడక్కడ వందలోపు మంది మాత్రమే భారత సర్ఫర్లుండేవారు. ఇప్పుడు వారి సంఖ్య 300కు చేరింది. వారంతా కలిసి ఓ సమాఖ్యలా మారారు. తాము నేర్చుకున్న దాన్ని మరికొందరికి నేర్పాలనే ఉద్దేశంతో షాకా సర్ఫింగ్ క్లబ్‌ను ఏర్పాటుచేశారు. ఔత్సాహికులు విద్యార్థులుగా చేరి ఫీజు రూపంలో కాస్త సాయపడ్డారు అలా ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ఇషితా కథ ఆస్ట్రేలియాకు చెందిన ప్రఖ్యాత సర్ఫింగ్ ఎక్విప్‌మెంట్ తయారీ కంపెనీ క్విక్‌సిల్వర్ వరకు చేరింది. ఆ సంస్థ ఆమెకు సర్ఫింగ్ బోర్డుల్ని, దుస్తుల్ని, పరికరాల్ని అందించి ప్రోత్సహించింది. ఇషితా క్లబ్‌తో కలిసి భారత్‌లో సర్ఫింగ్‌ను ప్రోత్సహించేందుకు కార్యక్రమాల్ని రూపొందించింది. ఆమెపై 'బియాండ్ ద సర్ఫేస్' అనే అంతర్జాతీయ డాక్యుమెంటరీ విడుదలైంది. మేటి సర్ఫర్లకు మాత్రమే అవకాశానిచ్చే రాక్సీ బ్రాండ్‌కు అంబాసిడర్‌గాను ఎంపికైంది. ఒకప్పుడు కలలుగన్న అమెరికా, ఆస్ట్రేలియా, శ్రీలంకల్లోని ప్రసిద్ధి చెందిన సర్ఫింగ్ బీచ్‌ల్లోని అలల్లో నడయాడి తన చిరకాల స్వప్నాన్ని నెరవేర్చుకుంది. నిప్పర్స్ ప్రోగామ్ పేరిట పాఠశాల విద్యార్థుల్ని లైఫ్‌గార్డ్‌లు (ప్రమాదవశాత్తు ఎవరైనా సముద్రంలో పడిపోతే కాపాడే గజ ఈతగాళ్లు)గా తయారుచేసే కార్యక్రమంలో అంతర్జాతీయ, జాతీయ సంస్థలతో కలిసి పనిచేస్తోంది.

ఇప్పుడు ఇషితా 'వన్ ఇన్ బిలియన్'. దేశంలోని ఏ మహిళా ఊహించని క్రీడలో ప్రొఫెషనల్‌గా మారిందీ స్ఫూర్తి కెరటం.

పొడవు కాళ్ల సుందరి

ఇలా అనగానే మనకు వెంటనే స్ఫురించేది శిల్పా శెట్టి రూపమే. మరి తనకు బాలీవుడ్‌లో 'పొడవు కాళ్ల సుందరి'గా అంత మంచి గుర్తింపు వుంది. అయితే ఇప్పుడు మన ముందుకొచ్చింది అమెరికా పొడవు కాళ్ల సుందరి. ఇరవయ్యేళ్ల ఈ అందగత్తె ఇప్పటికే వున్న రికార్డును తిరగరాసే పనిలో చాలా బిజీ.

ఆరు అడుగుల 5 అంగుళాల పొడవాటి పాలరాతి బొమ్మ పేరు హోలీ బర్ట్. అంత పొడవు అమ్మాయిని చూసేసరికి నోట మాట రానివారెందరో వున్నారట అమెరికాలో. కొందరైతే మనసులోని మాటను ఏమాత్రం దాచుకోకుండా 'చాలా అందమైన కాళ్లు నీవి' అని ప్రశంసిస్తుంటారట. ఆ పొడవాటి కాళ్లు ఆమెకు ప్రత్యేకమైన గుర్తింపు నివ్వడమే కాదు. మోడలింగ్ రంగానికి కూడా పరిచయం చేశాయి. ఇంతకీ ఆమె కాళ్ల పొడవు ఎంతనుకున్నారు! 49.5 అంగుళాలు. టెక్సాస్ మోడల్ లారెన్ విలియమ్స్ నమోదు చేసిన రికార్డును బద్దలు కొట్టి కొత్త రికార్డు రాయాలన్నది హోలీ స్వప్నం. లారెన్ కాళ్ల పొడవు 49 అంగుళాలు. అధికారిక గుర్తింపు లేదుగానీ అమెరికాలో పొడవు కాళ్ల సుందరి హోలీనే.

అన్నట్టు హోలీనే కాదు. ఆ ఇంట్లో అందరూ పొడవాటి వాళ్లే. 'పొడవాటి కుటుంబం'గా గుర్తింపు కూడా వుందట. నమ్మశక్యంగా లేదా! హోలీ బర్ట్ తల్లి 6'1 అడుగులు. తండ్రి 6'3, చెల్లి 6', తాతయ్య 6'8, బాబాయి 6'7 అంగుళాల పొడవుంటారు. ఈ కొలతలు చదివాక మీకు ఎలాంటి అనుమానం వచ్చే చాన్సే లేదు.

ఇప్పుడంటే కాలేజీలో చదువుకుంటోంది కానీ ... హోలీ బర్ట్ స్కూల్లో వున్నప్పుడు బోలెడన్ని సమస్యలు ఎదుర్కొంది. నేస్తాల ఎగతాళితో కూడిన మాటలు, వేధింపులు, వెక్కిరింతలూ అన్నీ అయ్యేవి. స్కూల్లో వున్నప్పుడు 'జిరాఫీ, చెట్టు' అని పిల్చి తెగ ఎగతాళి చేసి ఏడిపించేవాళ్లు. అయితే ఎప్పుడైతే తన టీచర్ కంటే పొడవుగా సాగిందో అప్పటి నుంచి ఆమెకు తరగతిలో, పాఠశాలలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు లభించింది. తోటివాళ్లకు అందని వస్తువులు తీసి ఇవ్వడం, చిటారు కొమ్మన వున్న కాయలను కోసి ఇవ్వడం లాంటివి చేసి 'హీరో'లా ఫోజు పెట్టేది. ఇక ఆటల్లో అందరికంటే ముందుండేది. ఏ ఆటకు జట్టును ఎంపిక చేయాలన్నా ముందుగా ఈమె పేరే చెప్పేవారు. సాకర్, బాస్కెట్‌బాల్ వంటి ఆటల్లో కోచ్‌లకు ప్రియాతిప్రియమైన శిష్యురాలిగానూ గుర్తింపు వుంది.

పొడవుగా వుండడం వల్ల గుర్తింపు, ప్రత్యేకత వున్నప్పటికీ కష్టాలూ వున్నాయి. ఓ మాదిరి కార్లు, విమానాల్లో కూర్చోవడానికి చాలా కష్టపడాల్సి వస్తుంది. కాళ్లు ఎంత ముడుచుకుని కూర్చున్నా ఇబ్బందిగానే వుంటుంది. ఇక చెప్పులు, బూట్లు, బట్టలు... అన్నిటి విషయంలోనూ సమస్యలే. మోడలింగ్ అవకాశాలు వస్తున్నా... ప్రస్తుతానికి చదువుకే ప్రథమ ప్రాధాన్యత అంటోంది. గ్రాడ్యుయేషన్ అయ్యాక మోడలింగ్‌నే చేపడుతుందట. ఇంత పొడవాటి అమ్మడికి అబ్బాయి దొరకడం కష్టమేమో అన్న మీడియా వాళ్ల ప్రశ్నలకు కొంటె జవాబిస్తోంది హోలీ. కనీసం 6'3 అంగుళాల పొడవు వున్న వ్యక్తిని మాత్రమే ప్రేమిస్తుందట.

✦


శివసేన
దాడులు
శాంతి సహనం

కార్టూన్ పంచ్

మీకిష్టమని పక్కింటి పిన్నిగారి దగ్గర రెండు కందిపప్పు బద్దలు చేబదులు తెచ్చి పప్పుచారు చేసా..!!


నా కళ్లతో చూడవయ్యా మహానగరం కనపడుద్ది!!
శంకుస్థాపన పూర్తి
విజన్ 2050
రాజధాని
22-10-15

చర్మం వొలిచేస్తా జాగ్రత్త!!
దాడులు - హత్యలు
BJP పరివారం
నోరుజారే నేతలపై అమిత్‌షా కన్నెర్ర!!

అట్టమీద కథ

వైకల్యాన్ని ఓడించి...

అదో క్రీడా సంగ్రామం. వైకల్యాన్ని దారుణంగా ఓడించి... కసిగా కదం తొక్కే ధీరులు బరిలోకి దిగే అసలు సిసలు పోరు. పారా అథ్లెట్ల శక్తి పాటవాలకు మైదానమంతా మోకరిల్లుతూ వారి విజయ గాథల్ని గర్వంగా ట్రాక్ ఎక్కించే పారాలింపిక్ అథ్లెటిక్స్ వరల్డ్ ఛాంపియన్‌షిప్పే దాని పేరు. బలహీనత అనే మాటను దూరంగా విసిరేస్తూ.. వైకల్యం అనే పోటును అడుగు కింద నలిపేస్తూ.. సాగే ఆ క్రీడా వీరుల స్వేదంతో తడిసి ఫీల్డ్ పులకిస్తుంది. ఐ మూవ్ అని కదిలే ఈ అథ్లెట్లందరూ ఓటమి, గెలుపులకు అతీతంగా బియాండ్ ఇన్‌క్రెడిబులే.

- అజయ్ కుమార్ వారాల

-9502395077

ఓ అంధ అథ్లెట్ 10 క్షణాల్లో 100 మీటర్లు దాటే ఫీట్‌కు కళ్లప్పగించాలన్నా. రెండు కాళ్లు లేని బ్లేడ్‌రన్నర్ 1500 మీటర్లను అవలీలగా పరుగుతీసే సంభ్రమంలో పడి పాదం కదపాలన్నా. ఒంటి కాలితో 2 మీటర్లు ఎత్తుకు దూకే హై జంప్ అద్భుతాన్ని చూసి ఎగిరి గంతేయాలన్నా. ఉన్న ఒక చేతితో, ప్రొస్తెటిక్ కాళ్లతోనో పరుగుతీసి జావెలిన్‌నో, డిస్కస్‌నో 60 మీటర్ల దూరం విసిరే ఆశ్చర్యంలో జత కలవాలన్నా. సగం చచ్చుబడిన శరీరాలతో చక్రాల బండిని కార్ రేసును తలపించే విన్యాసాలకు ప్రత్యక్ష సాక్ష్యులు కావాలన్నా దోహా పారాలింపిక్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు ట్యూన్ అవండి. ఖతార్‌లోని దోహాలో నిర్వహిస్తున్న ఈ 7వ ఎడిషన్‌ను కనీసం వార్తల్లోనైనా ఫాలో అవండి.

పారా అథ్లెట్ల పోరాటానికి తగ్గట్టు బియాండ్ ఇన్‌క్రెడిబుల్ పేరిట ఈ నెల 21 నుంచి నెలాఖరు వరకు జరిగే ఈ పోటీల్లో 90 దేశాలకు పైబడి, సుమారు 1300 మంది అథ్లెట్లు పాల్గొంటున్నారు. పురుషుల విభాగంలో 119, మహిళల విభాగంలో 91 కలుపుకుని మొత్తం 210 పతకాల పోరుకు వేదికైంది ఖతార్ సుహైన్ బిన్ హమాద్ క్రీడా ప్రాంగణం. అంగ వైకల్యాన్ని, మనో దౌర్బల్యాన్ని చిత్తు చిత్తుగా ఓడించే పారా అథ్లెట్ల కార్యసాధనకు వేదికైన ఈ స్టేడియం 12 వేల మంది ప్రేక్షకుల స్టాండ్ కలిగి ఉంది. అత్యాధునికత, పురాతన సంప్రదాయాల కలబోతతో విశ్వ నగరంగా రూపుదిద్దుకున్న దోహా ఇప్పటికే పర్యాటకుల హాట్ స్పాట్. మేలిమి బంగారు ఛాయలో మెరిసే ఇసుక మేటలపై సాగే సాహస కార్ ట్రిప్‌లకు ఇది పెట్టింది పేరు. వందల ఏళ్లనాటి ధౌ సముద్ర చేపల వేట, అరబ్బుల సాంప్రదాయ భారీ మార్కెట్ సౌక్ వకీఫ్ ప్రత్యేకం. ఆకాశాన్నంటే అద్దాల హార్మ్యాలతో రేయింబవళ్లు ధగధగలాడే దోహాకు ఈ గేమ్స్ మరింత ఆకర్షణనిస్తూ మరో విశేషంగా నిలవబోతున్నాయి.

వచ్చే ఏడాది అథ్లెటిక్స్‌తో పాటు అన్ని విభాగాల్లో నిర్వహించే ఒలంపిక్స్ స్థాయి రియో పారాలింపిక్స్‌కు దోహా పోటీలు హీట్ పెంచనున్నాయి. రెండేళ్లకో మారు జరిగే ఈ పోటీలు 2013లో ఫ్రాన్స్‌లోని లియాన్ మహానగరపు 'స్టేడి డు రోనె'ను వేదిక చేసుకున్నాయి. అప్పటి మెడల్ ట్యాలీలో 26 స్వర్ణాలతో కలిపి మొత్తం 53 పతకాలు గెలిచి రష్యా టాప్‌గా నిలిచింది. అమెరికా 52 పతకాలు, బ్రెజిల్ 40 పతకాలతో వరసగా తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మొత్తం 55 ప్రపంచ రికార్డులు బద్దలయ్యాయి. భారత్ నుంచి 36 మంది అథ్లెట్లు పాల్గొని 1 స్వర్ణాన్ని సాధించగలిగారు. ఇంటర్నేషనల్ పారాలింపిక్స్ కమిటీ (ఐపీసీ) నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ ప్రపంచ చాంపియన్‌షిప్ తొలుత జర్మనీ రాజధాని బెర్లిన్ వేదికగా 1994లో ప్రారంభమైంది. ఈ సారి పోటీలు ఓ నెల ముందే ప్రారంభమవ్వాల్సి ఉంది. దోహాలో భారీ భవంతుల నిర్మాణ పనుల వల్ల, ఎంపిక పోటీల షెడ్యూల్ వల్ల వెనక్కు జరిపారు. గతేడాది జనవరి నుంచి ఈ ఏడాది ఆగస్ట్ వరకు క్వాలిఫికేషన్ పీరియడ్‌గా ఎంపిక పోటీల్ని నిర్వహించారు. మారథాన్ పోటీల్ని లండన్‌లో ఏప్రియల్ 26నే నిర్వహించేశారు.

విలక్షణ పోటీలు

ప్రధాన స్రవంతి అథ్లెటిక్స్‌ను మించి పారా అథ్లెటిక్స్ ఆటలు అడ్రినల్ స్థాయిని విపరీతంగా పెంచేసి సస్పెన్స్ థ్రిల్లర్స్‌లా తోస్తాయి. ప్రొస్తెటిక్ కృత్రిమ కాళ్లు, చేతులతోనో, వీల్‌చెయిర్‌లలోనో, గ్రిప్‌స్టాండ్‌లకు శరీరాల్ని బిగించుకునో, రోప్ టెథర్‌లతోనో, అకౌస్టిక్ పరికరాలతోనో లేదా సైటెడ్ గైడ్‌లతోనో అనుసంధానమై పారా అథ్లెట్లు ఆడే క్రీడలు ఉద్విగ్నతకు లోనుచేస్తాయి. మహిళ, పురుష

విభాగాలకు వేర్వేరుగా జరిగే ట్రాక్ అండ్ ఫీల్డ్ క్రీడలు వేటికవే ప్రత్యేకమైనవి. పరుగు పందెం కింద 100 మీ., 200 మీ., 400 మీటర్ల స్ప్రింట్ రేసులతో పాటు మిడ్ డిస్టన్స్ (800 మీ., 1500 మీ.), లాంగ్ డిస్టన్స్ (5000 మీ., 10000 మీ.), రిలే (4x100 మీ., 4x400మీ.) పోటీలు ఆద్యంతం గుండె వేగాన్ని అమాంతం పెంచేస్తాయి. హర్డిల్స్ కింద 110, 400 మీటర్లు పరుగు ఉంటుంది. టీ11 కేటగిరీలో అంధుల అరచేతికి చూపున్న గైడ్ చేతిని కలిపి టెథర్‌తో ముడివేస్తారు. ట్రాక్ నుంచి పక్కకు తొలగకుండా ఈ ఏర్పాటు. పరుగు ప్రారంభమయ్యాక గైడ్‌గా వచ్చిన సాధారణ అథ్లెట్ సైతం అందుకోని వేగంతో దూసుకు పోతుంటారు పారా అథ్లెట్లు. ఈ దృశ్యం స్పందింప జేస్తుంది. పరుగు ముగిసేవరకు స్టేడియం నిశ్శబ్దంగా ఉండి ఫినిష్ లైన్‌కు అథ్లెట్లు చేరగానే ఒక్కసారిగా పిడుగులు పడినట్టు దద్దరిల్లిపోతుంది. అమెరికాకు చెందిన డేవిడ్ బ్రౌన్ అనే అంధ అథ్లెట్ (టీ11) గతేడాది 10.98 సెకన్లలో 100 మీటర్లను ఛేదించి సరికొత్త రికార్డు నెలకొల్పాడు. బ్రెజిల్‌కు చెందిన టెరెజిన్హా గుయిల్‌హెర్మినా అనే మహిళా పారా అథ్లెట్ ఇదే (టీ11) విభాగంలో 12.01 సెకన్లతో ప్రపంచ రికార్డు సృష్టించి విస్తుగొల్పింది. మరో పక్క చిరుతల్లా దూసుకుపోయే బ్లేడ్ రన్నర్లు హ్యూమనాయిడ్లుగా తోస్తారు. ఏదో సైఫై సినిమాలో రోబోల్లా వారు రివ్వున దూసుకుపోతుంటే గాల్లో తేలుతూ వెళుతున్న భావన కలుగుతుంది. ఇక హర్డిల్స్ గురించి తప్పక చెప్పుకోవాల్సిందే. ప్రొస్తెటిక్ అవయవాలతో వాళ్లు ఆటంకాలన్నింటినీ తప్పించుకుంటూ వేగంగా పరుగు తీస్తుంటే కలగంటున్నట్టు ఉంటుంది.

సైక్లింగే కింగ్..

ట్రాక్‌కు సంబంధించి జరిగే ట్రైసైకిల్ పోటీలు కారు రేసుల్ని తలపిస్తాయి. ఎటువంటి మోటార్ రొటేటర్లు లేని బండి రెండు చక్రాలను చేతులతో వేగంగా తిప్పుతూ, మలుపుల వద్ద మొత్తం శరీరాలను కదిలించి అదుపు చేస్తూ, వేగానికి తగ్గట్టుగా గాలిని చీల్చేందుకు ముఖాన్ని పూర్తిగా ముందుకు వంచి, చేతుల్ని రకరకాలుగా కదిలిస్తూ సాగే ఆ రేసు సింక్రనైజేషన్ ప్రదర్శనలా అనిపిస్తుంది. ఉత్కంఠభరితంగా సాగే పారా అథ్లెట్ల పోరాటం ప్రేక్షకుల నినాదాలతో స్టేడియాన్ని హోరెత్తిస్తుంది. స్టేడియానికి వందల మీటర్ల దూరం వరకు ఆ హోరు వినబడుతుందంటే కచ్చితంగా ఈ సైకిల్ రేసు షురూ అయిందని అర్థం. అసలు దోహా పారాలింపిక్ పోటీల్లోని చర్చంతా ఈ పోటీపైనే. (టీ54) వీల్ చెయిర్ రేసు మహిళల పోటీల్లో లెజెండ్స్ అయిన తాత్యానా మెక్ ఫడ్డెన్, మాన్యులా ష్కార్ ఈ పోటీలకు హాజరుకాలేకపోవడంతో మిగిలిన అథ్లెట్ల మధ్య పోటీ రసవత్తరంగా సాగనుంది. ఎవరి డామినేషన్ లేకపోవడంతో చివరి వరకూ ఏ అథ్లెట్‌ది పైచేయి అవుతుందో విమర్శకులు సైతం ఊహించలేకపోతున్నారు. పురుషుల విభాగంలో పోటీ ఇద్దరి మధ్యేనని మిగతా వారంతా కాంస్యం కోసమే వీల్స్‌ను హీటెక్కించాల్సి ఉంటుందని అంటున్నారు. ఎవరా ఇద్దరు అంటే ఇంగ్లండ్‌కు చెందిన వీయర్, స్విట్జర్లాండ్‌కు చెందిన మార్సెల్ హగ్‌లే. వీయర్ వీల్ తిప్పాడంటే ప్రత్యర్థులంతా పదుల అడుగుల వెనుకుండాల్సిందే. లియాన్‌లో అతడి గైర్హాజరీతో మార్సెల్ హగ్ చెలరేగిపోయాడు. 5 స్వర్ణాలతో హవా చాటాడు. వీరిద్దరి మధ్య పోటాపోటీగా సాగే సైక్లింగ్ రేసును తప్పక వీక్షించాల్సిందే. ఇక టీ44 వంద మీటర్ల రేసులో పోటీ అంతా బ్రౌనీ, జాన్నీ పీకాక్‌ల మధ్యే.

ఫీల్డ్‌లోకి ఎంటరైతే..

ట్రాక్ నుంచి పక్కకు వస్తే ఫీల్డ్‌లోకి ఎంటరవ్వాల్సిందే. ఉద్విగ్నతకు ఏ మాత్రం విరామం అంటూ ఉండదు. ఫీల్డ్ విభాగం కింద హై జంప్, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, డిస్కస్, జావెలిన్, క్లబ్ త్రో పాటు షాట్ పుట్ పోటీల్ని నిర్వహిస్తారు. తమ శరీరాలు అదుపు తప్పకుండా ఓ స్టాండ్‌కు కట్టుకుని త్రో చేసే అథ్లెట్లను చూస్తే గర్వంగా ఉంటుంది. ఇక హైజంప్, లాంగ్ జంప్‌ల్లో వారి విన్యాసాలు గుండె స్పందనను ఓ క్షణం పాటు ఆపేస్తాయి. మనదేశానికి చెందిన పారా అథ్లెట్ గిరీశ నాగరాజె గౌడ 2012 లండన్ పారాలింపిక్స్‌లో సిజర్ టెక్నిక్ ద్వారా 1.74 మీటర్లు హైజంప్ చేసి రజత పతకాన్ని దేశానికి అందించాడు. 2004 ఏథెన్స్‌లో జరిగిన జావెలిన్ పోటీల్లో దేవేంద్ర జజారియా వరల్డ్ రికార్డు సృష్టించి భారత్‌కు స్వర్ణాన్ని అందించాడు. ఏకంగా 62.15 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరి అంతకు ముందున్న 59.77 మీటర్ల రికార్డును తుత్తునియలు చేశాడు.

టీ11.. ఎఫ్54 అంటే..

పారా అథ్లెట్ల వైకల్య నిర్ధారణ, గుర్తింపు ఎలా అన్న దానిపై పెద్ద కసరత్తే ఉంటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలు, నిర్వచనాల ఆధారంగా మొత్తం 10 కేటగిరీలుగా వైకల్యాలను గుర్తిస్తున్నారు. కండరాల శక్తి హీనత, వాటి కదలికలో ఇబ్బందులు, అవయవ నష్టం, కాళ్ల పరిమాణంలో తేడాలు, మరగుజ్జుతనం, హైపర్‌టోనియా, అటాక్సియా, అథెటోసిస్, చూపు సమస్యలు, బుద్ధిమాంద్యం వంటి అంశాలతో వీటి పట్టిక రూపొందించారు. లండన్ పారాలింపిక్స్ నుంచే బుద్ధి మాంద్యం విభాగాన్ని ప్రవేశపెట్టారు. సాధారణంగా ఈ విభాగంలో అనేక క్రీడాంశాల్లో స్పెషల్ ఒలంపిక్స్ కమిటీ పోటీల్ని నిర్వహిస్తుంది. ఐపీసీ వీటిలో కొన్ని క్రీడల్ని నిర్వహించడం ద్వారా తన పరిధిని పెంచుకుంది. ఇక్కడ టీ అంటే ట్రాక్ అని, ఎఫ్ అంటే ఫీల్డ్ అని అర్థం. పక్కన సంఖ్య వైకల్యం తీరు, ప్రభావాన్ని చూపుతుంది. తీవ్ర కంటి చూపు సమస్య ఉంటే టీ11 కిందకు వచ్చే పరుగు వీరులు. క్లాస్ 20 బుద్ధిమాంద్యానికి సంబంధించింది. క్లాస్ 30-38 శరీర కదలిక సమస్యలున్న వారికి, క్లాస్ 40 మరగుజ్జులకు, క్లాస్ 42-46 అవయవ లోపమున్న వారికి చెందినవి. టీ51-54 వీల్‌చైర్‌కు పరిమితమైన వారికి, ఎఫ్ 51-54 చేతి సమస్యలున్న వారికి చెందిన కేటగిరీలు.

జావెలిన్ త్రో

సైక్లింగ్

బ్లేడ్ రన్నింగ్

లియాన్‌లోను స్వర్ణం కోసం వేట సాగించాడు.

ఐపీసీ కథ

పుట్టుకతోనో, వ్యాధులతోనో, దాడుల్లోనో, ప్రమాదాల్లోనో, యుద్ధాల వల్లో, ప్రకృతి బీభత్సాల్లోనో వైకల్యం బారిన పడినవారి జీవితాల్లో చైతన్యం తెచ్చేందుకు పారా క్రీడలు పుట్టుకొచ్చాయి. వైకల్యాన్ని జయించి తమ శక్తిని తెలుసుకునేందుకు క్రీడలే సరైనవని డాక్టర్ లుడ్‌విగ్ గుట్‌మన్ ఆలోచన చేశాడు. 1940లో పునరావాస కార్యక్రమంలో వీటిని భాగం చేశాడు. అవే పూర్తిస్థాయి క్రీడలుగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. 1952లో తొలిసారిగా వీల్ చెయిర్ రేసింగ్‌ను రెండో ప్రపంచ యుద్ధ సైనిక క్షతగాత్రుల కోసం నిర్వహించారు. వాటిని క్రీడాభిమానులు ఆదరించారు. అది మొదలు సుమారు 120 దేశాలు పారా అథ్లెట్లకు ప్రోత్సాహన్నిచ్చాయి. ఇంటర్నేషనల్ కోర్డినేటింగ్ కమిటీ (ఐసీసీ) ద్వారా ఇటలీలోని రోమ్ వేదికగా 1960లో తొలి పారాలింపిక్ గేమ్స్ జరిగాయి. కేవలం పారా అథ్లెట్లకే అంకితమైన ఇంటర్నేషనల్ పారాలింపిక్స్ కమిటీ (ఐపీసీ) 1989న జర్మనీలోని డుస్సెల్‌లార్ఫ్‌లో ప్రాణం పోసుకుంది. పారాలింపిక్స్‌ను నిర్వహించే పూర్తిస్థాయి బాధ్యతల్ని 1993 మార్చి 25న దీనికి ఐసీసీ అప్పగించింది. అప్పటి నుంచి పారాలింపిక్స్ గేమ్స్ (సమ్మర్, వింటర్), పారాలింపిక్ అథ్లెటిక్స్ వరల్డ్ చాంపియన్‌షిప్ వంటి భారీ క్రీడా పోటీలతో పాటు ఆయా దేశాల స్థాయి పోటీలకు నేతృత్వం వహిస్తోంది. 2012 లండన్ పారాలింపిక్స్‌తో ఈ కమిటీకి విశేషమైన పేరు వచ్చింది. 166 దేశాల నుంచి 4200 మంది పారా అథ్లెట్లు పాల్గొన్న ఆ క్రీడా సంభ్రమాన్ని ప్రపంచవ్యాప్తంగా సుమారు 400 కోట్ల మంది వీక్షించారు. 27 లక్షల టికెట్లు అమ్ముడుబోయాయి. 780 గంటల కవరేజీని లైవ్‌స్ట్రీమ్‌లో అందించారు. క్రీడా ప్రపంచంలో ఇదో రికార్డు. ఈ ఏడాది అక్టోబర్‌లో పాతిక వసంతాలు పూర్తి చేసుకున్న ఐపీసీ పారా క్రీడల అభివృద్ధికి ఒలంపిక్స్ కమిటీతో కలిసి పనిచేస్తోంది.

మన వీరులకు జేజేలు..

ఈ దఫా జరుగుతున్న పోటీల్లోను పాల్గొంటున్న భారత్ క్రీడాకారుల పోరాటాన్ని శ్లాఘించాల్సిందే. పారాలింపిక్స్‌లో భారత్‌కు తొలి పతకం అందించింది జోగిందర్ సింగ్ బేడీ. 1984లో జరిగిన పోటీల్లో షాట్ పుట్‌లో రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. దేశం ప్రతిష్టను పెంచే ఈ మేటి అథ్లెట్ల ఉత్సాహాన్ని నీరుగారుస్తోంది క్రీడా సంస్థల తీరు. భారత పారాలింపిక్ కమిటీ అవకతవకలు, చిన్న చూపుతో సతమతమైన అథ్లెట్లు సొంత ఖర్చులతోనే అంతర్జాతీయ పోటీలకు హాజరయిన దాఖలాలు కోకొల్లలు. అప్పులు పాలైనవాళ్లు చాలామంది ఉన్నారు. ఎనిమిది నెలలు ఉపయోగపడే గేమ్ వీల్ చెయిర్ నాలుగు లక్షల ఖరీదు చేస్తుంది. ప్రాక్టీస్‌లో ఉపయోగించే షూలు 7 వేల రూపాయలపైనే. చాలా వరకు మన అథ్లెట్లది పేదరికపు నేపథ్యమే. ఘజియాబాద్‌లో నిర్వహించిన జాతీయ పోటీలపుడు సరైన లావెట్రీలు, భోజన సదుపాయాలు కూడా కల్పించలేదు. ఈ విషయంపై పెద్ద దుమారమే లేచింది. అంతకు ముందు పారాలింపిక్ గేమ్స్ సమయంలోను అధికారులు, మేనేజ్‌మెంట్ చేసిన బుద్ధి తక్కువ పని అంతర్జాతీయంగాను భారత్‌కు తలవంపులు తెచ్చింది. కొందరు కోచ్‌లు, ఎస్కార్ట్‌ల పాస్‌లను వారికి కాకుండా తమ కుటుంబ సభ్యులకు వాడటం.. దాని కారణంగా క్రీడాకారులకు శిక్షణనిచ్చేందుకు కోచ్‌లను గేమింగ్ విలేజ్‌లోకి రానివ్వలేదు. అవినీతి, వర్గపోరుతో అంటకాగిన దేశీయ కమిటీని అప్పట్లో ఐపీసీ రద్దు చేసింది. అయితే క్రీడాకారుల భవిష్యత్ దృష్ట్యా ఐపీసీ పోటీలకు ఆహ్వానించింది. ఢిల్లీ, జిర్కార్‌పూర్, వైజాగ్, ఉజ్జయినిలో స్పోర్ట్స్ సెంటర్లను నెలకొల్పేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా వచ్చే ఏడాదిలో జరగబోయే రియో పారాలింపిక్స్‌కు ఏ మాత్రం పనికొచ్చేలా లేదు. 2020లో జరిగే టోక్యో పారాలింపిక్స్‌కు సిద్ధమవడానికేనని అధికారులే అంటున్నారు. ఎప్పుడో 1968 నుంచే భారత ప్రాతినిథ్యం పారాలింపిక్స్‌లో ఉన్నా ప్రపంచంతో పోటీపడటంలో మాత్రం ఎంతో వెనుకబడి ఉంది. డోపింగ్‌పై సరైన అవగాహన కల్పించలేని తీరు నిర్వాహకులది. ఈ కారణంగానే గోల్డ్‌మెడలిస్ట్ అయిన శరద్ కుమార్ రెండేళ్లు బ్యాన్‌ను ఎదుర్కోవాల్సి వచ్చింది. ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఆర్‌డీ సింగ్ లాంటి కోచ్‌ల సాయంతో పారా అథ్లెట్లు వారి కలల్ని నెరవేర్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. మన గర్వ కారణం నాగరాజ గౌడ, ఢిల్లీకి చెందిన కారం జ్యోతి, దీపా మాలిక్, శరద్ కుమార్, ఫొగాట్ సునీల్‌తోపాటు మొత్తం 15 మంది క్రీడాకారులు పాల్గొంటు న్నారు. మన అథ్లెట్లు ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో రాణించేం దుకు మద్దతుగా వారి ఆటను తప్పక వీక్షించాలి.

దీప మాలిక్

చాంటల్ పెటిట్‌క్లర్క్

దేవేంద్ర

ఫ్రాంజ్ నీట్లిస్పాచ్

పోరాడాల్సిందే..

నేను జూనియర్ హైస్కూల్లో చదువుతున్న రోజుల్లో నా కుడి కాలులో విపరీతమైన నొప్పి వచ్చేది. డాక్టర్లు నాకు కంపార్ట్‌మెంట్ సిండ్రోమ్ ఉందని చెప్పారు. పరీక్షలు చేసి కాలు తొలగించాలని చెప్పడంతో నమ్మలేకపోయాను. అథ్లెటిక్స్ అంటే నాకు ప్రాణం. పారాలింపిక్స్‌లో తప్పకుండా ప్రయత్నించాలనుకున్నాను. పరిస్థితులనేవి మన జీవితాల్ని శాసించకూడదు. వాటికి ఎదురుతిరిగి పోరాటం చేయాల్సిందే. వేలాది మంది చుట్టూతా చేరి మనల్ని గౌరవిస్తూ, ప్రోత్సహిస్తుంటే జీవితాన్ని గెలిచామనే భావన కలుగుతుంది. **- జార్రిడ్ వాల్లెస్, అమెరికా**

(సాధారణ అథ్లెట్ అయిన జార్రిడ్ కంపార్ట్‌మెంట్ సిండ్రోమ్ వల్ల కుడి కాలు తీయించుకోవాల్సి వచ్చింది. అయినా అథ్లెటిక్స్ వదల్లేదు. పారాలింపియన్‌గా కొత్త జీవితాన్ని ప్రారంభించాడు.)

లెజెండ్స్..

అభిమానులే కాదు సామాన్యులు సైతం ఆరాధించే పారా అథ్లెట్లు చాలా మందే ఉన్నారు. వారిలో ప్రధాన శ్రేణికి చెందినవాడు స్విజర్లాండ్‌కు చెందిన ఫ్రాంజ్ నీట్లిస్పాచ్. వీల్ చెయిర్‌లో దూసుకుపోతూ ంంరోడ్ సైక్లింగ్ రారాజుగా, టేబుల్ టెన్నిస్ మాయగాడిగా నిలిచిన ఫ్రాంజ్ 1976 నుంచి 2008 వరకు పారాలింపిక్స్‌ను పాలించాడు. తొలి పతకం గెలిచిన 28 ఏళ్ల తర్వాత కూడా అంతే శక్తిసామర్థ్యాలతో పోటీపడి 2004లో సైక్లింగ్‌లో కాంస్యాన్ని అందుకుని స్టేడియాన్ని సైలెంట్ చేశాడు. అంతర్జాతీయ కెరీర్‌లో 14 స్వర్ణాలు, 6 రజతాలు సాధించి తిరుగులేని అథ్లెట్‌గా పేరు పొందాడు. మహిళల్లో చాంటల్ పెటిట్‌క్లర్క్‌ది ప్రత్యేక స్థానం. కెనడాకు చెందిన చాంటల్ 2004, 2008 పారాలింపిక్స్‌లో 100 మీ., 200 మీ., 400 మీ., 800 మీ., 1500 మీటర్ల వీల్‌చైర్ పోటీల్ని క్లీన్ స్వీప్ చేసేసింది. అది కూడా 34, 38 ఏళ్ల వయసపుడు. మొత్తం 14 స్వర్ణాలతో రికార్డుకెక్కింది. మనదేశానికి చెందిన మాలతీ కృష్ణమూర్తి హొల్లా కెరీర్‌లో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మొత్తం 300 మెడల్స్ సాధించింది. కొరియా, బార్సిలోనా, ఏథెన్స్, బీజింగ్ పారాలింపిక్స్‌లో పాల్గొన్న క్రీడాకారిణి ఆమె. డెన్మార్క్‌లో నిర్వహించిన 1989 వరల్డ్ మాస్టర్స్ పోటీల్లో 200 మీ. పరుగు, షాట్ పుట్, డిస్కస్, జావెలిన్ త్రోలలో స్వర్ణాన్ని కైవసం చేసుకుంది.

గిరీశ నాగరాజె గౌడ

అజిటోస్ చిరు ప్రయత్నం

మిగతా చోట్ల ఇలా లేదు. పారా అథ్లెట్లను ప్రోత్సహించడానికి అందివచ్చిన ప్రతి అవకాశాన్ని అక్కడ చక్కగా వినియోగించుకుంటున్నారు. పారాలింపిక్స్ విప్లవాన్ని విస్తృతపరిచేందుకు లండన్ పారాలింపిక్స్ సందర్భంగా అజిటోస్ అనే సంస్థను ఐపీసీ ఏర్పాటు చేసింది. లాటిన్ భాషలో అజిటోస్ అంటే నేను కదులుతా (ఐ మూవ్) అని అర్థం. కుంగదీసి స్థాణువు చేసే వైకల్యాల్ని అధిగమించి ముందుకు కదులుతాననే భావాన్నిస్తుంది. క్రీడల ద్వారా వైకల్యమున్నవారి పరిస్థితిలో మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తోంది అజిటోస్. ఇప్పుడు జరుగుతున్న పోటీల్లో 'మై ఇన్‌క్రెడిబుల్ స్టోరీ' పేరిట పేద దేశాలు, పేదరిక నేపథ్యాల నుంచి వచ్చిన పారా అథ్లెట్ల కష్టాల్ని, వాటిని అధిగమించిన తీరును, వారి కలల్ని, ఈ పోటీల్లో అవి నెరవేర్చుకునే ప్రయత్నాన్ని కళ్లకు కడుతూ షార్ట్‌ఫిల్మ్స్, డాక్యుమెంటరీలు రూపొందించింది ఐపీసీ. వాటిని యూట్యూబ్ వంటి ఇంటర్‌నెట్ వేదికల్లో జొప్పించి క్రీడాకారులకు స్థైర్యాన్ని, మద్దతును కూడగడుతోంది. వీక్షకులకూ ప్రేరణను అందిస్తోంది. బ్రెజిల్‌కు చెందిన అంధ అథ్లెట్ టెరెజిన్హా గుయిల్‌హెర్మినాపై తొలి వీడియోను చిత్రీకరించింది. నిరుపేద కుటుంబంలో పుట్టిన టెరెజిన్హాకు 12 మంది తోబుట్టువులు. బడికి వెళ్లే నాటి నుంచే అవమానాలు, వెక్కిరింతలు ఎదుర్కొని ఒంటరితనంతో కుంగిపోయిన ఆమెకు పారా క్రీడలు కొత్త ప్రపంచాన్ని అందించాయి. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 100 మీ., 200 మీ., 400 మీ. పరుగు పందెంలో జయకేతనం ఎగురవేసి తన భవితను ఉజ్వలం చేసుకుంది టెరెజిన్హా. ఇలాంటి ఎందరో స్ఫూర్తివంతుల కథలు మరిన్ని ఈ పోటీల్లో వెలుగులోకి రానున్నాయి. వాటికి ప్రత్యక్ష సాక్షులుగా నిలిచే అవకాశాన్ని వదులుకోకండి. వారితో మూవ్ అయ్యి, వారి ఇన్‌క్రెడిబుల్ స్టోరీలో భాగమై, బియాండ్ ఇన్‌క్రెడిబుల్ నినాదమిచ్చేందుకు గొంతు సవరించండి.

✦

పరుగు ఆత్మస్థైర్యాన్నిచ్చింది...

2005 ఆగస్ట్ 22వ తేదీని ఎప్పటికీ మర్చిపోలేను. నా జీవితాన్ని దానికి ముందు, తర్వాత అనే రెండు అంకాలుగా మార్చిన రోజది. నవ్వుతూ గడపాలా, లేదా ఏడుస్తూ మిగిలిపోవాలా అనే విషయంపై నిర్ణయం తీసుకున్నా. జీవితంలోనే గెలుచుకున్న గొప్ప మెడల్ ఏంటంటే యాక్సిడెంట్ అయిన తర్వాత చాలా రోజులకు నన్ను నేను అద్దంలో చూసుకున్నపుడు గీయిసీ (తానే) మళ్లీ నవ్వుతూ కనిపించింది. రెండు కాళ్లు పోగొట్టుకున్నా ఇంతకు ముందులా చలాకీగా కనిపించింది. క్రీడలు నాకెంతో ఇచ్చాయి. పరుగు నాకు వైకల్యం ఉందనే భావన కలిగించదు. ఈ ప్రపంచాన్ని నా రెండు చేతుల్లోకి లాక్కోగలనన్న ఆత్మస్థైర్యం కలుగుతుంది. పారా క్రీడలనేవి వీరుల కథలు చెబుతాయి.

- గీయిసీ వర్సేస్, ఇటలీ

(ట్రాఫిక్ యాక్సిడెంట్‌లో రెండు కాళ్లను పోగొట్టుకుంది గీయిసీ. ంంంంంఆ తర్వాత పారా అథ్లెట్‌గా మారి 100, 200 మీటర్ల పరుగులో యూరోపియన్ రికార్డును బద్దలుకొట్టింది.)

ప్రత్యేకం

వజ్రాల వేట పేరు వింటేనే అదో థ్రిల్. ఎన్నో సాహసాలు చేసి నదీ తీరాల్లో అటవీ ప్రాంతాల్లో వెతికి వెలికి తీసినా చట్టం తెలీక గందరగోళం. పెదదోవలు పట్టి ఊచలు లెక్కెట్టే ముఠాల వార్తలు వింటూనే ఉంటాం. కానీ ఓ పిక్నిక్‌కు వెళ్లినట్టు సరదాగా ఓ వజ్రాల పార్క్‌కు వెళ్లి వజ్రాలు వెతుక్కుని దొరికితే ఎంచక్కా ఇంటికి తెచ్చుకోవచ్చు. పబ్లిక్ కోసం తెరిచిన వజ్రాల నిక్షేపమది. ఏం బాబూ లడ్డూ కావాలా అన్నట్టు వజ్రం కావాలంటే వెతుక్కోండని ప్రభుత్వమూ అంటోంది.

ఏం బాబూ వజ్రం కావాలా?

అమెరికాలోని అర్కాన్సాస్‌లోనే ఆ ప్రదేశముంది. క్రేటర్ ఆఫ్ డైమండ్స్‌గా పిలిచే ఆ పబ్లిక్ పార్క్‌లో పౌరులు వజ్రాలను వెతుక్కునే అవకాశం కలిగిస్తోంది అక్కడి ప్రభుత్వం. ఎక్కువగా బడ్డింగ్ మైనర్లకు అదో ప్రయోగశాలగా పనికివస్తోంది. ఇంటిల్లిపాది పిక్నిక్‌కు వచ్చినట్టు అక్కడకు వెళ్లి సరదాగా వజ్రాల వేటలో వారాంతాల్ని గడుపుతుంటారు. వజ్రాలు దొరికితే ప్రభుత్వానికి అప్పజెప్పాలన్న నిరాశ లేదు. వాటిని మార్కెట్‌లో ఎటువంటి ఇబ్బంది లేకుండా అమ్మేసుకోవచ్చు. అక్కడే కొనేవారు రెడీగాను ఉంటారు. ప్రైవేట్ సంస్థల గుత్తాధిపత్యం కనిపించదు. పబ్లిక్ కోసమే తెరిచిన ఆ వజ్రాల నిధి ఏదో మైనింగ్ నిలిపేసిన ప్రాంతం అనుకునేరు. అక్కడ వజ్రాలు అంతగా దొరకవేమో అనుకున్నా పొరబాటే. ఇప్పటి వరకు 79 వేల వరకు వజ్రాలు దొరికాయి. 1909లో వేట మొదలైతే 1972లో దీన్ని స్టేట్ పార్క్ చేశారు. అప్పటి నుంచి అయితే 19 వేల వజ్రాలను ప్రజలు మూటకట్టుకున్నారు. ఏటా వివిధ రంగుల్లో 600 వరకు వజ్రాలను పబ్లిక్ వెలికితీస్తోందని అధికారులే అంటున్నారు. అమెరికాలోనే లభ్యమైన అతి పెద్దదైన 40 కేరట్ల 'అంకుల్ సామ్' వజ్రం కూడా ఇక్కడ దొరికినదే. ఇదే కాక 36 కేరట్ల 'స్టార్ ముర్ఫ్రీస్‌బోరో' అనే మరో అత్యంత విలువైన వజ్రం, 15 కేరట్ల 'స్టార్ ఆఫ్ ఆర్కాన్సాస్', 8 కేరట్ల 'స్టార్ ఆఫ్ ష్రేవెపోర్ట్' కూడా ఇక్కడ వెలికితీసినవే. 16 కేరట్ల 'అమరిల్లో స్టార్‌లైట్'ను ఓ సాధారణ సందర్శకుడు వెలికితీయగలిగాడు. 3 నుంచి 5 కేరట్ల వజ్రాలు ఎక్కువగా లభిస్తాయి. అయితే పప్పు గింజంత సైజులో ఉన్నవి మాత్రం విరివిగా దొరుకుతుంటాయి. పెద్ద పరిమాణంలో ఉన్నవి మాత్రం అరుదుగా దొరకడానికి కారణం చాలామంది వట్టిచేతులతోనో లేదా సెరుకా అనే పరికరంతోనో వేట సాగిస్తారు. కారణం అది అగ్నిపర్వతపు లావా ఘనీభవించి క్రేటర్‌గా ఏర్పడిన ప్రదేశం కావడం. పెద్ద ఎత్తున మైనింగ్‌కు ప్రయత్నాలు చేసినా విఫలమయ్యాయి.

ఇలా మెరిసింది..

అసలు అక్కడ వజ్రాలు దొరుకుతాయనే విషయం 1906 వరకు ఎవరికీ తెలీదు. ముర్ఫ్రీస్‌బోరో స్థానిక రైతు జాన్ హుడ్‌ల్‌స్టోన్ పొలం ఆ ప్రాంతంలో మధ్యలో ఉండేది. ఓ రోజు అక్కడి బురదలో ఏవో రెండు రాళ్లు తళతళలాడటం చూశాడు. వాటిని కడిగి చూస్తే అవి చాలా విలువైనవి కావొచ్చనే విషయం అర్థమైంది. అక్కడి బ్యాంకు అధికారికి చూపించడంతో 50 సెంట్లకు రెండు రాళ్లను ఇచ్చేయమని అడిగాడు. కానీ రైతు కాస్త తెలివైనవాడు. ముఖ్యంగా అందులోని ఓ రాయి పచ్చగా మెరుస్తుండటంతో ఎందుకైనా మంచిదని న్యూయార్క్‌లోని రత్నాల ఎక్స్‌పర్ట్ దగ్గరకు ల్యాబ్ టెస్ట్‌లకు పంపించాడు. అవి చాలా విలువైన వజ్రాలని ల్యాబ్ వాళ్లు రిపోర్ట్ పంపించేసరికి అవాక్కయ్యాడు. ఈ విషయం దుమారంలా ఊరూరా పాకింది. తెల్లారేసరికి చాలామంది అక్కడకు వజ్రాల వేటకు తరలివచ్చారు. అతడి పేరు డైమండ్ జాన్‌గా మారిపోయింది. మైనింగ్‌కు జాన్ ఒప్పుకోక అందరూ నిరాశగా వెనుదిరిగారు. జాన్ కూడా సొంతంగా మైనింగ్ చేయడానికి ఆసక్తి చూపక దాన్ని ఓ ప్రైవేట్ సంస్థకు 36 వేల డాలర్లకు అమ్మేశాడు. వారు భారీ మైనింగ్‌కు ప్రయత్నించి విఫలమవడంతో సంప్రదాయ పద్ధతుల్లో జల్లెడపట్టి దొరికినన్ని వజ్రాలను వెలికితీసి 1952నాటికి మైనింగ్ ఆపేశారు. విశేషంగా వచ్చిన ఆ ప్రాంత ప్రచారాన్ని సొమ్ము చేసుకునేందుకు ఓ పార్క్‌గా మార్చారు. రెండు దశాబ్దాలు గడిచాక ప్రభుత్వం ఆ పార్క్‌ను కొనుగోలు చేసింది. అడపాదడపా బయటపడుతున్న వజ్రాలను సందర్శకులు సేకరించేవారు. వారికి ఎటువంటి అడ్డంకులు పెట్టకపోవడంతో చివరకు కేవలం వజ్రాల వెతుకులాటకే అక్కడకు చేరుకోవడం మొదలైంది. అలా పబ్లిక్ కోసం తెరిచిన వజ్రాల మైనింగ్ కేంద్రమైంది. దాదాపు పది కోట్ల ఏళ్లకు పూర్వం అగ్నిపర్వతపు పేలుళ్లలో పెల్లుబికిన మాగ్మా 80 ఎకరాల క్రేటర్‌ను ఏర్పరిచింది. చల్లబడిన లావాతో ఈ ప్రాంతం నల్లగా కనిపిస్తుంది. భూగర్భంలో అధిక ఉష్ణోగ్రతలు, పీడనాల వల్ల సుమారు 300 కోట్ల ఏళ్ల క్రితం ఏర్పడిన వజ్రాలుగా వీటిని శాస్త్రవేత్తలు లెక్కగట్టారు. ఇవి పేలుడులో బయటపడి ఈ ప్రాంతంలోని మట్టిలో ఉండిపోయాయి. వర్షాలకో లేక నీటి పాయల వల్లో వాటి మీద ఉన్న మట్టి కరిగి అవి కనిపించసాగాయి. అలాగే జాన్ కంటబడ్డాయి. ఆర్కాన్సాస్‌లోని ఈ ప్రాంతం మీదుగా వెళ్లే సందర్శకులు ఎందుకైనా మంచిదని ఈ క్రేటర్ దగ్గరకు వచ్చి వజ్రాల కోసం వెతుకులాడతారు. ఓ రాయైనా దొరక్కపోతుందా అనేది వారి ఆశ. ఇలాంటి చోటు మన దగ్గరా ఉంటే బాగుండని అనుకుంటున్నారు కదా.

నవ్వుల్ – పువ్వుల్

మోడ్రన్ ఆర్ట్

ఆర్ట్ గ్యాలరీలో జరుగుతున్న ప్రదర్శనను చూసేందుకు వెళ్ళింది ఒక అమ్మాయి.
అక్కడ ప్రదర్శనకు ఉంచిన ఒక ఫోటోను చూసి గ్యాలరీ యజమానితో మా గ్యాలరీలో ఇటువంటి భయంకరమైన ఫోటోలు పెట్టి మోడ్రన్ ఆర్ట్ అంటున్నారా అని అడిగింది.
దానికి యజమాని సమాధానమిస్తూ నా తల్లే.. చూసింది చాల్లే
కాని ఇక ఇంటికి వెళ్లు.. అది మోడ్రన్ ఆర్ట్ కాదు.. అద్దం అన్నాడు.

అప్పు

ప్రసాద్ : చచ్చే ఇబ్బందుల్లో ఉన్నాను. ఇంటి నిండా బంధువులున్నారు. ఓ వెయ్యి రూపాయలు అర్జంటుగా కావాలి. ఎవర్నడగాలో తోచక ఛస్తున్నాను హమ్మయ్య బతికించావు.
సుబ్బారావు: ఇంకా నన్ను అడుగుతావేమోనని హడలి ఛస్తున్నా (పారిపోతూ అన్నాడు).

తలనొప్పి

కన్నాంబ : కాంపౌండరు గారూ.. నిన్నటి నుండి తలంతా దిమ్ముగా ఉంది. తలపోటుగా ఉంది డాక్టరు గారు లేరా? మూలుగుతూ
కాంపౌండర్: మీరు కూర్చోండి. డాక్టరు గారు లోపల ఉన్నారు.
కన్నాంబ : త్వరగా పిలవండి ప్లీజ్.
కాంపౌండర్ : వస్తారుండమ్మా డాక్టరు గారికి రాత్రి నుంచి తలపోటుగా ఉంటే విశ్రాంతి తీసుకోవడానికి వెళ్లారు.

రేస్

జంబులింగం: ఒకసారి సైకిల్ రేస్‌లో పాల్గొంటాడు... బాగా తొక్కాడు గానీ ఓడిపోయాడు.
శంభులింగం: అంత బాగా తొక్కితే ఎలా ఓడిపోయావ్ రా?
జంబులింగం: ఎవడో సైకిల్‌కి స్టాండ్ వేశాడ్రా.

రచయిత

రచయిత: నేనీ మధ్య టి.వి. సీరియల్స్‌కు కూడా కథలు రాసి అమ్ముతున్నాను, తెలుసా?
శ్రోత: ఇంత వరకు ఏమైనా అమ్మావా?
రచయిత: ఆ... ఒక వాచీ, ఉంగరం ....

సమస్య

డాక్టర్ దగ్గరికి ఓ తాగుబోతు వెళ్ళాడు. 'డాక్టర్...నాకు నెర్రోజుల నుంచి నలతగా ఉంటోంది' అని అన్నాడు.
'అలాగా?...కానీ అనారోగ్య లక్షణాలేమీ కనిపించడం లేదే, బహుశా ఎక్కువగా తాగడం వల్ల కావొచ్చు' అని డాక్టర్ అంటాడు. అయితే మీరు కూడా తాగే ఉన్నారా? మత్తు దిగాక వస్తాలే!అని వెళ్ళిపోతాడు తాగుబోతు.

మిగిలింది

భార్య: చూశారా! నా ఉపవాసాల ఫలితం ఈ నెల బియ్యం ఖర్చు రెండు వందల రూపాయలు మిగిలింది.
భర్త: అవుననుకో! కాని... పళ్ళ షాపు వాడికి మాత్రమే ఇంకా ఓ వెయ్యి రూపాయలు బాకీ ఇవ్వాల్సి ఉంది.

అశ్వాన్ని అధిరోహించి...
పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి...

భారత స్వాతంత్య్ర సమరంలో బ్రిటిషు ముష్కరులను గడగడలాడించి వరుసగా మూడేళ్ళు ప్రత్యక్ష సాయుధ పోరాటం సాగించి ఆంధ్రజాతి పౌరుష ప్రతాపాలను ప్రపంచానికి చాటి చెప్పిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు. అల్లూరి అసలు పేరు అల్లూరి శ్రీ రామరాజు. అదే పేరుతో అడ్డతీగల పోలీస్ స్టేషన్‌పై ఆయన దాడి చేసినప్పుడు అక్కడి రికార్డుల్లో అల్లూరి శ్రీ రామరాజు అని సంతకం చేశాడు.



చరిత్రలో ఒక రోజు

- పడాల వీరభద్రరావు
9347035193

అడ్డతీగలలో అల్లూరి సీతారామరాజు దాడి చేసిన పోలీస్ స్టేషన్

చరిత్రలో ఎన్నో ఆధారాలు బయటపడుతున్నాయి. అదేవిధంగా అల్లూరి జీవిత చరిత్రలో ఒక కొత్త కోణం వెలుగు చూసింది. 1922 అక్టోబర్ 15వ తేదీన అడ్డతీగల పోలీస్ స్టేషన్‌పై దాడి చేసిన సమయంలో శ్రీరామరాజు గుర్రాన్ని ఉప యోగించినట్లు ఆధారాలు దొరికాయి. 1910 లో తహశీల్దార్‌గా పనిచేస్తున్న అల్లూరి పిన తండ్రి రామక్రిష్ణంరాజు అంతర్వేది తిరునాళ్ళకు పర్యవేక్షణాధికారిగా నియమితులయ్యారు. వదినగారైన సూర్యనారాయణమ్మ, శ్రీరామరాజు లతో సహా కుటుంబం అందరినీ తిరునాళ్ళకు తీసుకువెళ్లారు. అప్పుడు సమీపంలోని చించినాడ గ్రామంలో గుర్రపు స్వారీ నేర్పుతున్నారని తెలిసి అక్కడకు వెళ్ళి నేర్చుకున్నాడు. అలా గుర్రపు స్వారీలో శ్రీరామరాజు నిష్ణాతుడు.

బ్రిటిషు ముష్కరులపై ప్రత్యక్ష సాయుధ సమరం సాగించాలని శ్రీరామరాజు నిశ్చయించుకుని ఆయుధాలు సమీకరించడంలో భాగంగా 1922 ఆగష్టు 22వ తేదీన మొదటిసారిగా చింతపల్లి పోలీస్ స్టేషన్, 23న కృష్ణదేవిపేట, 24న రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్లపై పట్టపగలు దాడులు చేసి ఆయుధాలను సమీకరించి బ్రిటీషు ముష్కరులపై ప్రత్యక్ష సాయుధ పోరాటానికి శ్రీకారం చుట్టాడు. దానితో బ్రిటిషు ప్రభుత్వం శ్రీరామరాజు పితూరీని అణచివేయాలని నిర్ణయించుకుని విశాఖ జిల్లా నర్సీపట్నం నుంచి తూర్పు గోదావరి జిల్లా ఏలేశ్వరం వరకు రెడ్ అలర్ట్ ప్రకటించి ఈస్ట్ కోస్టు స్పెషల్ రిజర్వు, కోరాపుట్ రిజర్వు, మలబారు రిజర్వు దళాలకు చెందిన పోలీసు బలగాలను మోహరించింది. ఎన్నో యుద్ధాల్లో ఆరితేరిన భయంకర దుర్మార్గుడు అస్సాం రైఫిల్ దళ కమాండర్‌గా ఉన్న మేజర్ గుడాల్‌ను కమాండర్‌గా, కలెక్టరుగా రూథర్‌ఫర్డ్‌ను బ్రిటీషు ప్రభుత్వం నియమించింది. రూథర్‌ఫర్డ్‌కు ప్రత్యేక అధికారి బాధ్యతలను కూడా అప్పగించింది. బందోబస్తు పెట్టడం ఆశ్చర్యానికి గురిచేసింది. శ్రీరామరాజు వరుసగా మూడు పోలీస్ స్టేషన్లపై దాడులు చేసినప్పుడు ఆయన ప్రధాన అనుచరుడైన గంటం, మల్లు దొరల గ్రామమైన విశాఖ జిల్లా కొయ్యూర మండలం నడింపాలెంలోనే సమావేశాలు జరిపి వ్యూహరచనలు సాగించి, అక్కడ నుంచే వెళ్ళి దాడులు చేసాడు. అయితే ఆ తర్వాతి కాలంలో శ్రీరామరాజు ఏలేశ్వరం మండలం మర్రిపాడు గ్రామానికి మకాం మార్చి అక్కడ నుంచే కార్యాకలపాలు సాగించినట్లు ఆధారాలు దొరికాయి. ఆయనకు మర్రివీడు గ్రామ మునసబు జమీందారు సఖిరెడ్డి రుద్రయ్య ఆశ్రయమిచ్చాడు. రుద్రయ్యకు గుర్రపుశాల, నాలుగు గుర్రాలు ఉండేవి. దానిలో ఒక గుర్రాన్ని శ్రీరామరాజు వినియోగించేవాడని ఆధారాలు లభించాయి. శ్రీ రామరాజు మళ్ళీ రెండవసారి పోలీస్ స్టేషన్లపై దాడులు చేయాలని నిర్ణయించి, మర్రివీడుకి 2 కి.మీ. దూరంలో ఉన్న అడ్డతీగల మండలం తిమ్మాపురం మీదుగా 16 కి.మీ. దూరంలో ఉన్న అడ్డ తీగల పోలీస్ స్టేషన్‌పై దాడికి వ్యూహం ఉంది. పోలీస్ స్టేషన్‌పై దాడి చేసున్నట్లు మూడు రోజులు ముందుగానే బాణానికి మిరపకాయ, ఒక చీటి కట్టి మరీ సమాచారం అందించాడు. అడ్డతీగల పోలీస్ స్టేషన్‌పై దాడికి ముందు రోజు రాత్రి మర్రివీడు నుంచే కాగడా చేతబూని గుర్రంపై అడ్డతీగల మండలం వేటమామిడి నుంచి వై. రామవరం వెళ్ళే రోడ్డులో 5 కి.మీ. దూరంలో ఉన్న మల్లవరం మామిళ్ళ గ్రామంలో ఉన్న తేనెల మంగి చేరుకుని అప్పటికే అక్కడకు చేరుకున్న అనుచరులతో అడ్డతీగల పోలీస్ స్టేషన్‌పై దాడికి వ్యూహరచన చేశాడు. ఆ మరుసటి రోజున అడ్డతీగల పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. బ్రిటీషు ప్రభుత్వం శ్రీరామరాజు సేనలను ఎదుర్కోలేకపోయినా, ముందుగా మిరపకాయటపా ద్వారా పోలీస్‌స్టేషన్‌పై దాడి చేస్తామని హెచ్చరించటం వల్ల శ్రీరామరాజుకు ఆయుధాలు దక్కకుండా భూగర్భంలో ఆయుధ భాండాగారాన్ని ఏర్పాటు చేసి, ఆయుధాలు అందులో భద్రపరిచారు (అల్లూరి దాడిచేసిన వాస్తవ పోలీస్ స్టేషన్, ఆ భూగర్భ ఆయుధ భాండాగారం నేటికి చెక్కు చెదరకుండా సాక్ష్యంగా నిలిచింది). అది శ్రీరామరాజు సేనలు గమనించలేకపోయాయి. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సిబ్బంది అంతా ముందుగానే పరారయ్యారు. ఒక ఎస్ఐ, ఒక కానిస్టేబుల్ మాత్రమే ఉన్నారు. శ్రీరామరాజు పోలీస్ స్టేషన్‌లో 5 గంటలకు పైగా ఉండి ఎస్ఐ, కానిస్టేబుల్‌ను ఆయు ధాల కోసం ప్రశ్నించినా ప్రయోజనం లేకపోయింది. పోలీస్ స్టేషన్‌లో నామ మాత్రంగా ఉన్న ఒకటి, రెండు ఆయుధాలను స్వాధీనం చేసుకున్న శ్రీ రామరాజు అక్కడి పోలీస్ స్టేషన్ లోని రికార్డుల్లో ఎన్ని ఆయుధాలు పట్టుకెళుతున్నదీ జాబితా రాసి దాని కింద 'అల్లూరి శ్రీరామరాజు' అని సంతకం చేసి... ఆయుధాలను వెంట తీసుకు వెళ్ళిపోయాడు.

(రచయిత అల్లూరి సీతారామరాజు చరిత్ర పరిశోధకులు)

దేశమంటే మనుషులోయ్

దేశమంటే మట్టికాదన్న మహాత్ముణ్ణి స్మరించి
మనుషుల కోసం దేవులాడుతున్నాను
పాలనంటే సైనిక పాలన కాదన్న లింకన్‌ను తలచి
ప్రజాపాలన కోసం వెతుకుతున్నాను!
అనారోగ్యం పాలైన ఆరు నెలల పసికందును
ఆర్థిక దిగ్బంధం
సర్కారు దవాఖానాకు చేర్చింది
బిడ్డ ఎండిన డొక్కలు ఎగిసిపడుతుంటే
ఓర్వలేని తల్లి ఓర్పు పాలకై వెళ్ళింది
పైబడి పీక్కుతున్న పందికొక్కులు
బిడ్డ ఎముకలు మిగిల్చాయి
అస్థికల్ని చూసిన తల్లి కన్నీటిలో
ఆసుపత్రి పడవలా తేలిపోయింది!
రెండేళ్ళ చిన్నారి రోడ్డుపై
నడకను నాట్యం చేసి నడుస్తుంటే
అల్లంత దూరంలో అమ్మ
అవధులు మించి ఆనందిస్తుంటే
అదాటుగా ప్రవేశం చేసిన గ్రామ సింహం
సింగమై కోర దంష్ట్రాల్ని గుచ్చి పట్టుకుపోయింది
భూగోళాన్ని బద్దలు చేస్తూ
తల్లికేకలు దద్దరిల్లాయి!
ప్రజాస్వామ్యం ఎదురుపడింది
మీ క్షేమం మా ధ్యేయమంటుంది!
సాయం సంధ్యలో బడి నుండి బైటకొచ్చిన
ఆరు వసంతాలు నిండని ఆ బాలిక
సంచిని కుడి నుండి ఎడమకు
ఎడమ నుండి కుడికి మార్చుకుంటూ
ఇంటి కెళ్ళే ఆనందం అర్ణవమై
నోరు తెరుచుకున్న డ్రైన్
నోట్లోకి జారిపోయింది
జనం ఆహాకారాలు వెల్లువై
కళ్ళు చేతులు వెతకటం మొదలెట్టాయి
బిడ్డను పొట్టలో దాచిన ప్రవాహం
విగత జీవిని చేసి వదలిపెట్టింది!
స్తంభాలపై ఠీవిగా అధిష్టించే విద్యుత్ తీగలు
నేలకు దిగి ముచ్చట్లాడుకుంటున్నాయి
ఆరేళ్ళ అమాయక ప్రాయం
మరణం జననం తెలియని చిన్నారి
కాళ్ళను అంటుకున్నాయి
తప్పించే ప్రయత్నం తల్లి చేసే లోగా
తిరిగి రాని లోకాలకు బిడ్డ తరలిపోయింది!
దేశమంటే మనుషులోయ్ అన్న మహాత్ముని స్మరించి
మట్టి కోసం దేవులాడుతున్నాను
పాలనంటే ప్రజాపాలనన్న లింకన్‌ను తలచి
ప్రజాస్వామ్య వాదుల కోసం వెతుకుతున్నాను
ప్రజాస్వామ్యం ఎదురుపడింది
మీ క్షేమం మా ధ్యేయం అనేందుకు సిగ్గుపడుతూంది!

- అడిగోపుల వెంకటరత్నమ్
సెల్ 9848252946

తెలుగు తెర వెలుగు రేఖ

కాకిలా కడ వరకు బతికే బదులు హంసలా ఆరు మాసాలు బతికితే చాలు అన్నది ఆయన సిద్ధాంతం. కళల పుట్టిల్లు తెనాలి. గుంటూరు జిల్లా తెనాలి వాస్తవ్యుడైన గోవిందరాజుల వెంకట సుబ్బారావు 1895లో జన్మించాడు. చెంపకు చారడేసి కళ్ళు స్ఫురద్రూపం. కంగుమనే కంఠం. నవ రసాలూ ముఖంలో తొణికిసలాడే అభినయం. ఎంత పొడుగాటి సంభాషణలైనా ఒకసారి విని వెంటనే జీర్ణించుకుని వెను వెంటనే ఆ డైలాగు పాత్ర పరిధిలో పలికిస్తూ ప్రేక్షకుల హర్షధ్వానాలు అందుకోవడంలో దిట్ట. ఈ ఉత్సాహమే ఆయన్ని చిన్నతనం నుంచీ రంగస్థలం మీదకు నడిపించింది.

అరుదైన నటన

ఆయన రంగస్థలం మీద ఏ పాత్రని పోషిస్తున్నా ఆ పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేసి నటనలో వైవిధ్యం చూపించి తన సహజ సిద్ధమైన నటనతో ప్రేక్షకులు ఒన్స్‌మోర్‌లు.. జేజేలూ.. చదివింపులూ అందుకొనేవాడు. గయోపాఖ్యానం నాటకంలో సాత్యకి, భీముని పాత్రల్లో నటించి శభాష్ అనిపించుకొనేవాడు. ఆ రోజుల్లో వేదం వేంకట రామ శాస్త్రి పేరుమోసిన నాటక ప్రయోక్త. ఆయన రచించిన ప్రతాపరుద్రీయం నాటకంలో యుగంధరుడిగా నటించి ఆ పాత్రకి ప్రాణం పోశాడు. వేంకట రామశాస్త్రి, గోవిందరాజుల అభినయానికి పట్టంకట్టి పలు సత్కారాలు,

ఆయన అభినయానికి అద్యుడు.. వాచకానికి విరించి. ఆ నటరాజు అనుగ్రహం పరిపూర్ణంగా పొందిన కళాస్రష్ట. నటనకి కొత్త భాష్యం చెప్పి.. సాంకేతిక అంశాలతో లెక్క లేకుండా తాను చేసిందే నటన తాను చెప్పిందే డైలాగు అన్నట్టు ప్రేక్షకుల్ని ఒప్పించగలిగాడు. తెర మీద నటుడు కనిపించేవాడు కాదు.. పాత్రే పరవళ్ళు తొక్కేది. రంగస్థల అభినయానికి అలవాటు పడ్డ ప్రేక్షకులు అతని నటనకు థియేటర్లలో జేజేలు పలికి హారతులు పట్టేవారు. ఆ నటుడు పేరే గోవిందరాజుల సుబ్బారావు.

సన్మానాలతో ముంచెత్తాడు. ప్రతాప రుద్రీయం నాటకం ఆంధ్ర దేశంలోనే గాకుండా పలు రాష్ట్రాల్లో కీర్తి బావుటా ఎగురవేసింది. గోవిందరాజుల తిరుగులేని నటుడిగా నిరూపించుకున్నాడు.

సినీ రంగ ప్రవేశం

ఆ రోజుల్లో గూడవల్లి రామబ్రహ్మం అభ్యుదయ భావాలతో 'మాలపిల్ల' సినిమా నిర్మాణం చేపట్టాడు. అప్పటి సమాజానికి ఆ కథే పెద్ద చుక్కెదురు. 1938లో స్వాతంత్ర్యం రాక ముందు 'మాలపిల్ల' మకుటంతో సినిమా తీయడమంటే మాటలా? సాంఘికపరమైన కట్టుబాట్లు ఎన్నుండేవో? అసలు ఈ సినిమా పూర్తవుతుందా? పూర్తయినా విడుదలవుతుందా? విడుదలైనా ప్రేక్షకులు ఆదరిస్తారా? ఇవీ అనుమానాలు. అటువంటి సమయంలో గూడవల్లి రామబ్రహ్మం 'మాలపిల్ల'గా కాంచన మాలని నటించేందుకు ఒప్పించాడు. బ్రాహ్మణుడిగా గోవిందరాజుల సుబ్బారావు, అతని కొడుకు పాత్రలో గాలి వేంకటేశ్వరరావు నటులుగా (ఆయనే చిత్ర కథానాయకుడు) సినిమా విడుదలైంది. ఎన్నో నిరశనలు. మరెన్నో ప్రశంసలు. ఆ చిత్రంలో గోవిందరాజుల నటనని మెచ్చుకోని నటులు లేరు. కాంచనమాల ఓ పక్క గోవిందరాజుల మరోపక్క తమ నటనతో చిత్ర స్థాయిని అందనంత ఎత్తుకి తీసుకుపోయారు. తొలి చిత్రంతోనే సంచలన నటుడిగా పేరు తెచ్చుకున్నాడు.

మాయల మరాఠీ

'బాలనాగమ్మ' చిత్రం కోసం మాయల మరాఠీ పాత్రలో గోవిందరాజుల నటించాడు. ఆ రోజుల్లో అదో గొప్ప సంచలనం. మాయల మరాఠీని చూసిన వాళ్ళు ఎవరూ లేరుగాని ఇలాగే వుంటాడేమో అనిపించింది. విజయనగరం సరస్వతి థియేటర్‌లో ఈ చిత్రం ప్రదర్శిస్తుండగా మాయల మరాఠీ బాల నాగమ్మని పెట్టిన కష్టాలు నిజమని నమ్మి కోపాన్ని అణుచుకోలేక ప్రేక్షకులు ఎదురుగా కూర్చున్న ఫకీరుని చితకబాదారు. ఆ దెబ్బతో తెర చిరిగిపోయింది. ఆ రోజుల్లో తెరలుండేవి మరి. ప్రదర్శన ఆగిపోయింది. అది గోవిందరాజుల నటన ప్రతిభా పాటవాలకు నిదర్శనం.

బ్రహ్మనాయుడంటే గోవిందరాజులే

పల్నాటి యుద్ధం చిత్రం నిర్మిస్తున్నారు. ఇందులో నాయకురాలు నాగమ్మగా కన్నాంబ, బ్రహ్మనాయుడిగా గోవిందరాజుల నటించారు. ఆ చిత్రంలో కన్నాంబ, గోవిందరాజుల మధ్య జరిగిన సంభాషణలు చప్పట్ల వర్షం కురిపించాయి. సంభాషణలు పలికించడంలో దిట్ట కన్నాంబ. ఆమెను కనిపించకుండా చేశాడంటే ఆయన సామర్థ్యం అంచనా వేసుకోవచ్చు. ఇక్కడ చెప్పుకోదగ్గ

విశేషమేమిటంటే తదుపరి పాతాళ భైరవిలో ఫకీరుగా నటించిన ఎస్వీ రంగారావు నటనలో ఇంగ్లీషు నటుడు షెల్లాక్‌ని అనుకరించినా, వాచకం పలకడంలో గోవిందరాజులని కొంత వరకు ప్రేరణగా తీసుకున్నట్లు ఒప్పుకున్నాడు. అలాగే పల్నాటి యుద్ధం తదుపరి చిత్రంలో బ్రహ్మనాయుడిగా నటించిన ఎన్టీ రామారావు గోవిందరాజుల వాచకాన్ని అభినయాన్ని ప్రేరణగా తీసుకున్నట్లు ఒప్పుకున్నాడు. ఏది ఏమైనా పాత పల్నాటి యుద్ధమే పదింతలు మేలు అని ఒప్పుకున్న రసజ్ఞులు ఎంతమందో. అదీ గోవిందరాజుల వైభవం.

ఆణిముత్యాలు

తొలి చిత్రంలోనే సంచలన నటుడిగా పేరు సంపాదించిన గోవిందరాజుల మిగతా చిత్రాల్లోనూ సమతూకంగా నటనని ప్రదర్శించాడు. రత్నమాల, ధర్మాంగధ, గుణ సుందరి కథ (కస్తూరి శివరావు నిర్మాణం), విజయా వారి షావుకారు వంటి చిత్రాల్లో టైటిల్ పాత్ర పోషించాడు. ఈ చిత్రంలోనే షావుకారు జానకి పరిచయమయ్యింది. ఇందులో షావుకారు చంగయ్య పాత్రకి జీవం పోశాడు గోవిందరాజుల. పెళ్ళి చేసి చూడు చిత్రంలో ఎన్టీఆర్ తండ్రిగా నటించాడు. తదుపరి భాగ్యరేఖ, పాండురంగ మహత్యం, చరణదాశి చిత్రాల్లో నటించాడు.

కన్యాశుల్కం న భూతో న భవిష్యత్

సి.పుల్లయ్య గారి కన్యాశుల్కం చిత్రం గురించి ప్రత్యేకించి చెప్పుకోవాలి. గురజాడ విరచితమైన

కన్యాశుల్కానికి జీవం పోశారు గోవిందరాజుల, మహానటి సావిత్రి, ఎన్టీఆర్, బుచ్చమ్మ పాత్రలో నటించిన జానకి. ఈ సినిమా గురించి ప్రత్యేకించి చెప్పుకోవలసింది లుబ్ధావధానుల పాత్ర. గోవిందరాజుల కోసమే పుట్టిందీ పాత్ర. సావిత్రి నటన చూసి గొప్ప భవిష్యత్తు ఉంటుందని జోస్యం పలికాడు. అదే నిజమైంది.

నేను పాత్రలోకి వెళ్తాను- మీరు కెమెరాలోకెళ్లండి!

ఆ రోజుల్లో ప్రతి నటుడికి మైక్, కెమెరా సెన్స్ తప్పనిసరి. అయితే గోవిందరాజుల 'అయ్యా, నేను పాత్రలో కెళ్తాను మీరు కెమెరాలోకెళ్ళండి. నన్ను కన్ఫ్యూజ్ చేయొద్దు. మీరు కన్ఫ్యూజ్ కావొద్దు.' అని చెప్పి నవ్వేసేవాడు. గోవిందరాజుల అభినయం చూసి చాలా క్లోజప్పులు తీసుకునేవారు. చాలా సేపు ముఖం దగ్గరగా లైటింగ్ ఉన్నా వేడిమిని భరిస్తూనే నవ్వుతూ సంభాషణలు చెప్పగలిగేవాడు. 'అయ్యా! తమరి ముఖం మాడిపోయింది' అని ఎవరైనా గుర్తు చేస్తే 'కాలిపోయే కాలానికి కంగారెందుకు? నేను వైద్యుడ్నే కదా (ఎల్.ఎమ్.పి) పసరు పూసుకుంటే తెల్లారే సరికి నా ముఖంలో మీకు సూర్యోదయం కనిపిస్తుంది' అంటూ గలగల నవ్వేసేవాడు.

ఇమంది రామారావు
9010133844

ఓ చిన్న అతిథి పాత్రతో బాలీవుడ్‌కు పరిచయమై కథానాయికగా రాణిస్తున్న తార శ్రద్ధ కపూర్. తండ్రి శక్తి కపూర్, పిన్ని పద్మిని కొల్హాపురి, తేజస్విని కొల్హాపురి నటనారంగంలో పేరు ప్రతిష్టలున్నవారే. తల్లి శివంగి కొల్హాపురి కూడా నటి, గాయని కావడంతో... సహజంగానే బాల్యం నుంచి నటన పట్ల ఆసక్తి పెంచుకుంది శ్రద్ధ. 'తీన్ పట్టి'తో బాలీవుడ్‌లో తెరంగేట్రం చేసి... 'లవ్ కా ది ఎండ్, ఆషికి 2, ఏక్ విలన్, ఎబిసిడి 2, గోరీ తేరే ప్యార్ మే, హైదర్' చిత్రాల్లో నటించింది. సినిమాలు, బాల్యం గురించి తన మాటల్లోనే...

మాధురి... కరిష్మా ...అంటే ఇష్టం

- చిన్నతనంలో నాన్న వల్ల నాకు ప్రత్యేకమైన గుర్తింపు వుండేది. స్కూల్లో చాలా మంచి గుర్తింపు వుండేది. దోస్తులే కాదు. టీచర్లూ నన్ను ప్రత్యేకంగా చూసేవారు. ఇక నాన్నను చూసి గర్వపడేదాన్ని. వేసవి సెలవుల్లో షూటింగ్ సెట్స్‌కి వెళ్లేదాన్ని. అప్పుడు నాన్న ప్రభావం నా మీద చాలా బాగా పడింది.
- కొత్త విషయాలు నన్ను ఇట్టే ఆకట్టుకునేవి. అన్నయ్య ప్యాంట్లు వేసుకొని ... వాడి నేస్తాలతో కలిసి ఆడేదాన్ని. పోట్లాడే దాన్ని. అచ్చంగా మగరాయుడిలా వుండేదాన్ని. ఎప్పుడైతే కొంచెం పెద్దగా అయ్యానో ఇక అబ్బాయిలా గెంతడం మానేశాను.
- నటిని కావాలని వుండేది ఎప్పుడూ. కానీ ఎవరైనా 'హేయ్. నువ్వు శక్తి కపూర్ కూతురివి. తప్పకుండా యాక్టర్ అవుతావు' అంటే నేను ఒప్పుకునేదాన్ని కాను. 'కాదు. నేను డాక్టర్ అవుతా. సైకాలజిస్టు అవుతా' అని చెప్పేదాన్ని. వాళ్లతో అలా అన్నప్పటికీ డాన్సు నేర్చుకోవడం మొదలెట్టాను. సినిమాలు చూడసాగాను. 'దిల్ తో పాగల్ హై' చూసినప్పుడు 'వావ్... అలాంటి సిన్మా చేయాలి' అనుకునేదాన్ని. నాన్న మాత్రం చదువుకోమనేవారు. నేను కూడా గ్రాడ్యుయేషన్ చేసి నటన ఎంచుకుందామనుకునేదాన్ని. ఆ తర్వాత కొద్ది కాలానికే కాలేజీ మానేసి 'తీన్ పట్టి' ఆడిషన్ ఇచ్చాను.
- మొదటిసారి ఓ అభిమానికి ఆటోగ్రాఫ్ చేసినప్పుడు... నా సంతకం అంత అందంగా వుంటుందా అనుకున్నాను.
- అమ్మ నుంచి పొందిన స్ఫూర్తితోనే 'హైదర్'లో ఒక పాట పాడాను.
- కరిష్మా కపూర్ అంటే చాలా ఇష్టం. తను చాలా అందంగా, సహజంగా వుంటుంది.
- డాన్స్ దగ్గరకొచ్చేసరికి మాధురీ దీక్షిత్‌ని ఇష్టపడతాను.
- నా అభిమాన నటుడు షారుక్ ఖాన్ చిత్రం 'కుచ్ కుచ్ హోతా హై' అంటే చాలా ఇష్టం.

వింత లోకం

ఒత్తిడి తగ్గించుకోవడానికే ఇలా ...

ఎవర్ని కదపండీ.. స్ట్రెస్సు.. స్ట్రెస్సు.. స్ట్రెస్సు. టన్నుల లెక్కన రోజురోజుకీ పోగుబడిపోతూ ఆరోగ్యాన్ని హరించేస్తుందది. ఇంకేముంది! చేతిలో ఏది వున్నా విసిరికొట్టేస్తారు కొందరు. అక్కడితో ఆగితే సరే మొత్తం ఇల్లంతా ధ్వంసం చేస్తేగానీ కోపం తీరదని అనిపిస్తుంటుంది. కానీ అలా చేస్తే సైకో అనేస్తారు. రష్యాలో మాత్రం ఓ పెద్దమనిషి ఏకంగా తన ఇంటినే పగలగొట్టమంటున్నాడు. పేద్ద సుత్తితో కొడతారా, బేస్‌బాల్ బ్యాట్ వాడతారా, లేదా చైన్ సా తెప్పించి ఉంచమంటారా అంటూ కస్టమర్లకు చిట్టా విప్పుతున్నాడా ఇంటి యజమాని అలెక్సీ బొరిట్స్కీ. టీవీలు, డ్రెస్సింగ్ టేబుళ్లు ఇలా దేన్ని ఎంచుకుంటారో మీ ఇష్టం అంటూ ఆఫర్లు కూడా ఇస్తున్నాడు. వినడానికి బానే వున్నట్టనిపిస్తున్నా... పగిలిపోయిన వస్తువుల లిస్టుకు తగ్గట్టు డబ్బులు వసూలు చేస్తాడు. అయితే ఇవన్నీ వెరీ చీపే. అందుకే ఎప్పటి నుంచే ఫ్రస్టేషన్‌ను పంటి బిగువున దాచుకున్న వాళ్లంతా అలెక్సీ ఇంటికి పరుగుతీస్తున్నారు. కనిపించిన వస్తువున్నల్లా టపీటపీమని బాదేసి ఫ్రీ అయిపోతున్నారు.

తూచ్.. పెళ్లిళ్లు

అర్జెంటీనాలో పెళ్లి అంటే ఏమిటనే యువత ఎక్కువైపోయింది. బ్యూనస్ ఎయిర్స్‌లో మరీను. కళ్యాణం ఊసెత్తితేనే అంతెత్తున లేస్తున్నారట. అయితే అబద్ధపు పెళ్లిళ్లకు మాత్రం ఎగిరి గెంతేస్తున్నారట. ఫేక్ వధువు, వట్టి వరుడుల ఫేక్ పెళ్లికి టిక్కెట్లు కొని మరీ హాజరవుతున్నారు.ఏ ఒక్కరు కూడా పెళ్లి కార్డు ఇవ్వకపోవడంతో ఏంటా అని తాను కూడా పెళ్లికి నో అనుకోవడంతో మరి బ్యాండ్ బాజా బరాత్‌కు చిందేయడం ఎలా అని తలపోశాడు మార్టిన్ అసెర్బీ అనే 26 ఏళ్ల పెళ్లీడు కుర్రాడు. అబద్ధం పెళ్లి ఏర్పాటు చేసి మిత్రులకి పార్టీ ఇస్తే పోలా అని ఐడియా తట్టింది. వెంటనే ఆ ఫేక్ పెళ్లి కాస్త కానిచ్చాడు. ఇది తెగ నచ్చి చాలామంది పాలోమంటున్నారు. ఈ తూచ్ పెళ్లిళ్లు ఎంత వాస్తవంగా ఉంటాయో అంత రక్తి కూడా కట్టిస్తాయి. తీరా పెళ్లి ఉంగరం తొడిగే సరికి మాజీ ప్రియుడు (వీడూ ఫేకే) వచ్చి వధువుతో పరారవుతాడు. లేదా పెళ్లికి హాజరైన అమ్మాయితో ఇన్‌స్టంట్ ప్రేమలో పడి వరుడు చెక్కేస్తాడు. ఇంకా చాలా ట్విస్టులతో మాంచి ఎంటర్‌టైన్‌మెంట్ కానిచ్చేస్తున్నారు అక్కడి యూత్.

కుక్కలున్నవి జాగ్రత్త

బ్రిటన్‌కు చెందిన లిన్, టోనీ ఎవరెట్ దంపతుల ఇంటికి దర్జాగా వెళ్లిపోలేరు. వీరు ఏకంగా 41 కుక్కల్ని పెంచుకుంటున్నారు మరి. అది కూడా అధికారులు లిమిట్ పెట్టడంతో. లేకుంటే సెంచరీకి చేరేవేమో శునకాల అరుపులు. చిన్నప్పటి నుంచే లిన్‌కు వీటిని పెంచే పిచ్చి పట్టుకుంది. భర్త తొలి బహుమతి ఏంకావాలని అడిగితే కుక్క పిల్ల కావాలందట. అప్పటి నుంచి సందర్భానికొకటి చొప్పున 41 శునకాలు చేరిపోయాయి. ఏడాది 25 లక్షలు పైగా వీటి తిండికి, గుడ్డకు, గూడుకు, లగ్జరీలకు ఖర్చైపోతున్నాయి వారికి. ఎప్పుడో పెళ్లైన కొత్తలో హనీమూన్‌కని టూర్ వేసిన జంట ఆ తర్వాత వీటి పిచ్చిలో పడి ఇప్పటి వరకు పొరుగూరికి కలిసి వెళ్లిన సందర్భం లేదు.

ఫ్లాష్‌బ్యాక్‌లోనే ఉండిపోయారు

కిటెన్ వాన్ మ్యూ, రిచర్డ్ దంపతులది మరో పిచ్చి. వాళ్లు 1940ల కాలంతో ప్రేమలో పడ్డారు. ఆ కాలానికి తగిన జీవనశైలే కాదు ఇంటిని కూడా అలా మార్చేసుకున్నారు. అప్పటి వస్తువులు, అలంకరణలతో కనిపించే ఆ ఇంటి వాతావరణాన్ని చూస్తే ఏదో ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లొచ్చినట్టు అనిపిస్తుంది. ఇంగ్లండ్‌లో వార్‌విక్‌షైర్ బర్లెస్క్యు నృత్యకారిణియైన కిటెన్ 15 ఏళ్ల క్రితం మిచెల్లి అయిన తన పేరును మార్చుకుని తన జీవితాన్ని 80 ఏళ్ల క్రితపు కాలానికి అంకితమిచ్చింది. భవన నిర్మాణ కార్మికుడైన రిచర్డ్‌ది అదే పిచ్చి రిచర్డ్ పెంచిన భారీ మీసాల్ని చూసి ప్రేమలో పడిపోయింది. వారి పెళ్లి కూడా ప్రపంచ యుద్ధం కాలం నాటి శైలిలో నాలుగేళ్ల క్రితం జరిగిపోయింది. వారికి పుట్టిన రెండు నెలల పాపకు కూడా అప్పటి కాలానికి తగిన దుస్తులు, ఆట బొమ్మలు కొంటున్నారు.

ఆలోచింపచేసే 'ఒక మరణం'

చేతిలో ఇమిడిపోయే చిన్న సెల్ ఫోన్ సహాయంతో కూడా లఘ చిత్రాలను సరికొత్తగా రూపొందిస్తున్నారు. వివిధ సామాజికాంశాల ఆధారంగా ఈ బుల్లి చిత్రాలు ప్రేక్షకుల ప్రశంసలు అందుకొని అవార్డుల్ని సైతం సొంతం చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో లఘు చిత్ర ప్రేక్షకులను మెప్పించిన చిత్రమే 'ఒక మరణం'. 'సమాజంలో మనిషికి బతకడం తెలుసు కానీ, సమాజంతో కలిసి బతకడం తెలియడం లేదు' అనే అంశాన్ని చాలా హుందాగా తెరకెక్కించారు దర్శకుడు, రచయిత అయిన వినోద్ అనంతోజు. చిత్రీకరణకు తమ నివాస ప్రాంతాన్నే లొకేషన్ స్పాట్‌గా మలుచుకొన్నారు. పక్క వారి గురించి పట్టించుకునే తీరిక... సమయం లేని బిజీ లైఫ్‌ల గురించి చెప్తూనే ... మరో వైపు దాని వలన మనం ఏం కోల్పోతున్నామో కూడా వివరించారు.

ఒక రూంలో ఫ్యాన్‌కి శవం వేళ్లాడుతూ ఉంటుంది. కానీ ఆ చనిపోయిన వ్యక్తి ఎవరో ఎవరికీ తెలియదు. పక్క రూంలో ఉండే వాళ్లు ఆ శవాన్ని చూడడం.. పోలీసులు రావడంతో సంభాషణ ప్రారంభం అవుతుంది.

"ఒకడు పదిరోజులుగా మీ పక్క రూంలో ఉంటున్నా మీకు అతనెవరో తెలియదంటే ఎక్కడో ఏదో లోపం ఉన్నట్లు మీకు అనిపించట్లేదా?" అన్న ప్రశ్నకు సమాధానంగా

"మా పనులతోనే మాకు సరిపోతుంది. ఇంకా పక్కవాడి గురించి పట్టించుకునే టైమ్ మాకెక్కడ దొరుకుద్దీ?" అంటాడొకడు. ఇదంతా ఇలా వుండగానే తను ఆఫీసుకు వెళ్లడానికి అనుమతించమంటాడు మరొకడు.

"మీ రూంలో ఒకడు ఆత్మహత్య చేసుకున్నాడు. అయినా నీవు ఆఫీసుకి వెళ్తావా?" అంటాడు పోలీసు అధికారి.

బిజీ లైఫ్‌లో పక్కవాడి గురించి పట్టించుకునే తీరిక లేకపోవడాన్ని సమాజంలో నెలకొని ఉన్న నిర్లక్ష్యపు ధోరణిని ప్రశ్నిస్తాయి సంభాషణలు. 14 నిమిషాల నిడివి గల ఈ చిత్రంలో 'స్నేహితులంటే ఎలా ఉండాలో.... ఎలా ఉండకూడదో కూడా తెలియ చెప్పారు. కష్టాల్లో ఉన్న స్నేహితులు వస్తే వాళ్లను నిర్లక్ష్యం చేయకూడదని తెలియజేస్తూ ఒక వేళ నిర్లక్ష్యం చేస్తే ఎలాంటి పరిణామాలు జరుగుతాయో అనే విషయాన్ని స్మిజో..వినోద్' పాత్రల ద్వారా చాలా చక్కగా తెరకెక్కించారు. స్వతహాగా సంఘజీవి అయిన మనిషి అసాంఘిక జీవిగా మారిపోతున్నాడు. అందుకే 'మానవ సేవే మాధవ సేవ' అనే సూక్తిని కొత్త బాణీలో బాధ ఎవరికైనా సమాజంలో ఉండేదే. కానీ ఆ బాధ మనిషిని దహించే వ్యధగా మారక ముందే సాటి వాడికి సాయం చేయడం అన్నది మానవ ధర్మం' అని చెప్తాడు. అంతే కాకుండా సమాజంలో ఒంటరితనం అనుభవించే కంటే ఆత్మహత్య చేసుకోవాలనే నిర్ణయానికి రావడమంటే ఆ హృదయం ఎంత బాధ పడుతుందో తెలియజేస్తూ

సమాజంతో ఆత్మహత్యకుగల కారణాలను అన్వేషించే ప్రయత్నం చేశాడు. పాత్ర ద్వారా మనిషిని మనిషి పట్టించుకోని సమాజంలో శ్మశానంతో సమానం' అనే మాటలను చెప్పిస్తాడు. ఇలా ఈ చిత్రంలోని సంభాషణలు ఆలోచింపచేస్తాయి. ప్రతి ఒక్క ప్రేక్షకుడు తమని తాము ప్రశ్నించుకునేలా చేస్తుంది. చిత్రంలోని తారాగణానికి గతంలో నటనానుభవం లేకపోయినప్పటికి చాలా చక్కగా నటించారు. ప్రతి పాత్ర ద్వారా వాస్తవాలను వెల్లడించిన చిత్రం 'ఒక మరణం'.

- ఎ. మోహన్ కృష్ణ
- 8897765412

ఆహ్వానం

యూ ట్యూబ్‌లో వేలాది లఘు చిత్రాలు హల్‌చల్ చేస్తుంటాయి. 'చైతన్యం కలిగిస్తాయి. ఆలోచన రేకెత్తిస్తాయి. మూఢ నమ్మకాలపై కనువిప్పు కలిగిస్తాయి' అనుకున్న షార్ట్ ఫిల్మ్ గురించి రాసి పంపండి. ప్రచురిస్తాం. మా చిరునామా: స్నేహ, షార్ట్ ఫిల్మ్స్, హౌస్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2

ఇ-మెయిల్: snehaweekly.praja@gmail.com

◆ కథ

ఎందుకు పారేస్తాను నాన్నా?

- చాగంటి సోమయాజులు

చెల్లిని వొళ్లో కూచోపెట్టుకుని కృష్ణుడు వంటింట్లో కబుర్లు చెప్పుతున్నాడు. వాళ్లనాన్న పిలిచి చుట్టలు తెమ్మని డబ్బులిచ్చేడు.

కృష్ణుడు వీధి ముఖం చూడకుండా, (మొగుడు చచ్చిన విధవలాగ) ఇంట్లో దూరి కూచుంటున్నాడు. నాన్న చుట్టలు తెమ్మని పురమాయించేడు. హైస్కూలు దాటి చుట్టల దుకాణానికెళ్లాలి. మేష్టర్లు, తోటి విద్యార్థులు అక్కడుంటారు. కృష్ణుడికి రోడ్డెక్కటమే నామోషిగా ఉంది. బడి పక్క నుంచి ఎలాగ వెళ్లడమని గింజుకుంటూ బయలుదేరాడు.

ఉదయం ఎనిమిది గంటలు కావొస్తున్నది. బడి పెట్టేవేళ. వీధి చివరనుంచే బడిగోల సముద్రపు ఘోషలాగ వినబడుతున్నాది. బడి పక్క నుంచి వెళ్లక తప్పదు. రాక తప్పదు. బడి కనబడగానే కృష్ణుడికి బెంగపట్టుకుంది. హైస్కూలు పిల్లల గందరగోళంతో కళకళ్లాడుతున్నది. వరండాలు, గదులు, చుట్టూ రోడ్లూ, విద్యార్థులతో, విద్యార్థినులతో చూడ సొంపుగా ఉంది. రోడ్డువారగా కృష్ణుడు తలొంచుకుని పరిగెట్టాడు.

"కృష్ణా!" అని స్కూలు వరండాలోంచి కేకొచ్చింది. కృష్ణుడు తిరిగి చూడక తప్పింది కాదు. నరశింహం పరిగెట్టుకొచ్చి వాడి భుజం మీద చెయ్యేసి

"ఏం రా, నువ్వు బళ్లోకి రావడం లేదు?" అనడిగేడు.

"సోమవారం చేరుతాను" అని కృష్ణుడు చెప్పేడు.

"పుస్తకాలు కొన్నావా?"

"ఇంకా లేదు."

వేగిరం కొనుక్కో, మళ్లా అయిపోతాయి. ఎక్సరుసైజు పుస్తకాలు షాపుల్లో కొనకేం. స్టోర్సులో చవగ్గా వున్నాయి. ధరలన్నీ దారుణంగా పెరిగిపోయాయిరా!"

నరశింహం డబుల్ కప్పు చొక్కా, వానావా పేంటూ, జోళ్లూ తొడుక్కుని నీటుగా ఉన్నాడు. కృష్ణుడికి ఉన్న బట్టలన్నీ రెండు నిక్కర్లు, రెండు చొక్కాలు ఉన్నాయంటే ఉన్నాయి. ఒక నిక్కరుకి పోస్టాఫీసుంది. ఒక చొక్కా, భుజం చిరిగి జారిపోతే, వాళ్లమ్మ ఎత్తి కుట్టింది. చెయ్యి బుట్టలాగ

లేచిపోయింది. రేపుకో జత. కృష్ణుడు పేంట్లు కుట్టించమని ఎప్పుడూ ఏడవలేదు. పేంటుకైతే బట్ట ఎక్కువ పడుతుంది. బట్ట ఎక్కువైతే డబ్బు ఎక్కువవుతుందని వాడికి తెలుసు. మరి రెండు జతలు కుట్టించమని బతిమాలుకున్నాడు. కాళ్లావేళ్లా పడ్డాడు. ఏడ్చుకొన్నాడు. ప్రయోజనం లేకపోయింది.

నరశింహం చంకలో కృష్ణుడికి కొత్త పుసక్తం కనబడ్డాది.

"ఏం పుస్తకం రా అదీ?" అనడిగేడు.

"ఇంగ్లీషు పుస్తకం. నేనన్ని పుస్తకాలూ కొనేశాను. జాగ్రఫీ పుస్తకమే కొనలేదు. జాగ్రఫీ పుస్తకాలింకా స్టోర్సువాళ్లకి రాలేదు. చూడు పుస్తకం" అని ఇచ్చేడు.

కృష్ణుడు పేజీలు తిరగేశాడు. కొత్త పుస్తకంలోంచి ఒక విధమైన పరిమళం పైకి వచ్చింది. కృష్ణుడు పుస్తకంలోకి మొహం పెట్టి వాసన చూశాడు.

"కొత్త పుస్తకం వాసన బాగుంటుందికదరా?" అన్నాడు నరశింహం.

"కమ్మగా ఉంటుంది. నాకెంతో ఇష్టం" అన్నాడు కృష్ణుడు.

"నీకింగ్లీషులో ఫస్టుమార్కు రాలేదు, కదరా?"

"నాలుగు మార్కుల్లో పోయింది".

"ఎవరి కొచ్చిందిరా?"

"శకుంతల కొట్టేసింది"

"నిజమే! నేన్నమ్మలేదు దాని కెన్నొచ్చాయి?"

"నా కరవై నాలుగు, దాని కరమై ఎనిమిది",

"ఆడపిల్ల అని మేష్టరు ఎక్కువ వేసేసుంటాడు".

"నీ మొహం! అది తెలివైంది."

"తస్సా చెక్కా! ఆడపిల్లలు చదివేస్తున్నారురా!"

కృష్ణుడు మార్కుల గొడవ తేగానే గొప్పవాడయిపోయాడు. తెలివైనవాడు కాబట్టే నలుగురూ గౌరవిస్తున్నారు. లేకపోతే వాడి కుళ్లుగుడ్డలని చూసి అంతా దూరంగా ఉండేవాళ్లే. వాడికి బడి పక్కని నిలబడడం, బడికెళుతున్న నరశింహాన్ని చూడడం చాలా కష్టంగా ఉంది. ఎంచేతంటే, కృష్ణుడు బడికెళ్లి చదువుకునే అవకాశాలు తప్పిపోయాయి. వాళ్ల నాన్న ఈ ఏడాది కృష్ణుడికి చదువు చెప్పించనని నిశ్చయంగా చెప్పేశాడు.

"ఎక్కడేనా చదువు మాన్పించుతారండి? ఋణమో పణమో చేసి ముక్క చెప్పించకపోతే కుర్రాడెందుకేనా పనికొస్తాడా? చదువుకునే ఈడులో బడి మానిపించి, ఇంట్లో కూచోబెడితే తర్వాత గాడిదలని కాయడానికేనా పనికిరాకుండా పోతాడు. ఏదో చూసి బడిలో వెయ్యండి" అని వాళ్లమ్మ శతపోరి చెప్పుకొస్తున్నాది.

"బళ్లో వెయ్యగనే సంబరమా? నాడు చదివేది ఫోర్తుఫారమ్. జీతమెక్కువ. నెలనెల ఎంత కట్టాలో తెలుసా? తూగ్గలనా? ప్రవేశపెట్టడానికి, పుస్తకాలకే ఔతుంది ఏభై రూపాయలు. దస్తా కాగితాలు రూపాయి, అర్ధణా పెనసలు ఆరణాలు! ఎక్కణ్ణుంచి తేవడం? మొహాన్ని వాడికి లేందే! వాడి ప్రారబ్దం, మన ప్రారబ్దం! వారం వారం ఎక్కడలేని డబ్బూ బియ్యానికి ముడుపు చెల్లించడానికి తల ప్రాణం తోక్కొస్తున్నాది. మాటలా?" అని వాళ్ల నాన్న చెప్పుకొస్తున్నాడు.

తల్లి మాటే నెగ్గుతుందో, తండ్రి మాటే నెగ్గుతుందో ఇంకా తెలలేదు.

కృష్ణుడికి మాత్రం సందిగ్ధం లేదు. వాడు తల్లిదండ్రులని బాగా ఎరుగు. తల్లి ప్రతీ విషయంలోనూ బడబడలాడడమేకాని ఆఖరికి తండ్రి చెప్పినట్టే జరుగుతూ ఉంటుంది. అంచేత చదువుకి స్వస్తి చెప్పడమే ఖాయమని నిర్ధారణ చేసుకొని నామర్దాతో కృష్ణుడు కుళ్లిపోతున్నాడు. కృష్ణుడికి కొత్త ఇంగ్లీషు పుస్తకం పేజీలు తిరగేసిన కొద్దీ గుండెల్లో గాభరా పుట్టింది. చదువుతున్న కుర్రాళ్ల మీద ఈర్ష్యా, తనకి చదువులేకుండా పోయిందన్న దు:ఖము రెండూ రెండు లేడిక పాములై అతని బుర్రను కరకర లాడిస్తున్నాయి.

"కృష్ణా, వేగం చేరరా! డివిజన్లు పెట్టేశారు. నేను 'జే' డివిజనులో పడ్డాను. మన బేచివాళ్లంతా 'జే' డివిజనులోనే పడ్డారు" అన్నాడు నరశింహం.

"అమ్మబాబో! 'జే' డివిజను దాకా పిల్లలున్నారా? అని ఆశ్చర్యపడ్డాడు కృష్ణుడు.

" 'జే' తో ఐపోలేదు. 'కే' డివిజను కూడా ఉన్నాది".

ఏ, బి, సి, డి, అని లెక్కబెట్టి –"పదకొండు డివిజన్లే!" అన్నాడు కృష్ణుడు. ఒక్క ఫోర్తుఫారములో సుమారు ఐదు వందల మంది విద్యార్థులున్నారు. కృష్ణుడు అక్కడ నిలబడలేక పుస్తకాన్నిచ్చేసి "నేను చుట్టలకెళ్లాలి, పోతా"నన్నాడు.

"ఈ బొమ్మ చూశావట్రా?" అని నరశింహం పాఠాలకి ముందున్న త్రివర్ణ చిత్రం తీసి చూపించేడు.

రైతులు జొన్న చేలు కోస్తున్నారు. జొన్న రేకులని కూడదీసి కట్టుకున్న పిట్టగూడు గుడ్డతోటే జారిపోతున్నాది. చేలమీద రెండు పిట్టలు ముక్కులు విప్పి ఎగురుతున్నాయి.

కోతల వాళ్లు తలలెత్తి పిట్టలని చూస్తున్నారు. అది త్రివర్ణ చిత్రం.!

హైస్కూలు మొదటిబెల్లు ఖంగు ఖంగు మంటూ దూరంగా ఉన్న పిల్లలందరినీ పిలుస్తున్నాది. రోడ్డు, వరండాలు, గదులూ విద్యార్థులతో, విద్యార్థినులతో, ఉపాధ్యాయులతో కళకళ్లాడుతున్నాయి.

పుస్తకాలు పట్టుకుని సరస్వతీ దేవిలాగు శకుంతల వొచ్చింది. ఆమె చిన్నపిల్ల. పదకొండేళ్లది. సూది ముక్కు, సూది గెడ్డాం. ఆ రెంటికీ పొందికయిన నోరు కలిగి ముద్దొస్తూ ఉంటుంది. తెలివితేటల తళుకుతో దాని కళ్లు చాంచల్యాన్ని పొందుతున్నాయి.

"కృష్ణా! ఇంగ్లీషులో ఫస్టుమార్కు నాది!" అని వొస్తూనే ఉడికించింది.

"ఒక్క ఇంగ్లీషులోనే కదా! నాకు మూడింట్లో ఫస్టుమార్కు లొచ్చాయి. లెక్కల్లో నూటికి నూరు!" అన్నాడు కృష్ణుడు.

" ఇంగ్లీషు ముఖ్యమైందండీ!" అన్నాది శకుంతల.

"లెఖ్ఖలంతకన్నానండి. ఆ మాటకొస్తే తెనుగు ముఖ్యమండి. తెనుగులో ఫస్టు మార్కెవరిదండి?"

"ఇంగ్లీషే ముఖ్యమండి ఎవరి నడుగుతానో అడుగు!"

"తెనుగేనండి. బియ్యేవాళ్లక్కూడా ఇంగ్లీషులో మానేసి లెక్కలూ అవీ తెనుగులోనే చెప్పాలని పేపర్లో పడ్డాదండి?"

"నువ్వు మహా పేపరు చదివి ఏడిశావు!"

"నే నాంధ్రప్రతిక రోజూ చదువుతాను. మా ఇంటిదగ్గరవాళ్లకొస్తుంది".

రెండో బెల్లు ఖంగు ఖంగుమని ప్రారంభమైంది. నరశింహానికి శకుంతల మొహం చూడ్డానికి లజ్జవేసింది. వాడు చదువూ సంధ్యారాని దద్దమ్మ. వాళ్లతోపాటు సంభాషించడానికి తాహతులేక తల వాల్చుకుని మౌనవ్రతం పట్టేడు. తన హనావా పంట్లాము ధగధగలాడుతున్నా, కృష్ణుడి కుళ్లు నిక్కరు కనబడుతున్నా వాడికి తక్కువతనం పట్టుకుంది. రెండోబెల్లు కాగానే చల్లగా బడిలోకి జారిపోయాడు.

"బెల్లయింది, బళ్లోకిరా!" అన్నాది శకుంతల.

"నేను సోమవారం నుంచి వస్తాను" అన్నాడు కృష్ణుడు.

"ఫోర్తు ఫారమ్‌లో నీ పని చెపుతాను. ఒక్క ఫస్టు మార్కు రానివ్వను."

"ఇహనన్ని ఫస్టుమార్కులూ నీవేలే!"

"ఏం?"

"ఏమీ లేదు".

"నువ్వు మా ఇంటికి రావడం మానేశావేంరా? మా అమ్మా, నాన్న, 'కృష్ణుడు రాలేదేమ్మా' అని రోజూ అంటారు."

"ఏమీ లేదు. "

"నేను బళ్లోకి పోవాలి బాబూ!" అని పరిగెట్టింది.

"శకుంతలా?" అని పిలిచాడు.

"ఏం!" అని ఆగింది.

ఎందుకు పిలిచాడు? ఆమెతో నిజం చెప్పేసి దు:ఖోపశమనం చేసుకుందుకా? ఎందుకు పిలిచాడో వాడికే తెలియలేదు.

"ఏమీ లేదు" అన్నాడు.

శకుంతల వెళ్లిపోయింది. ఇద్దరూ ఒక్క ఈడువాళ్లు. క్లాసుకి వాళ్లిద్దరే అందరికన్నా తెలివైనవాళ్లు. ఒకరి నోట్సు ఒకరు పుచ్చుకుంటూ స్నేహంగా వుండేవాళ్ళు. పంతంతో చదివేవాళ్లు. శకుంతలతో పోటీ కృష్ణుడికి వికాసవంతంగా ఉండేది. శకుంతల దస్తూరీ కృష్ణుడికీ జ్ఞాపకమొచ్చింది. ఆమె దస్తూరీ మంచిది కాదు. కొక్కిరిబిక్కిరిగా రాస్తుంది. అతనిది ముత్యాలకోవ. శకుంతల బడిలోకి పరిగెడుతుంటే కృష్ణుడు స్తంభించిపోయి చూస్తు నిలబడిపోయాడు. పిల్లల గోలంతా క్రమేణా అణిగిపోయింది. వరండాలన్నీ ఖాళీ అయిపోయాయి. మేష్టర్ల మాటలు ఉండుండి వినబడుతున్నాయి. వేలకొద్దీ విద్యార్థులు డెస్కుల మీద వాలి కూచుని పాఠాలు వింటున్నారు. బడి దగ్గర నుంచి కృష్ణుడు కదలలేకపోయాడు. తన చదువుపోయింది కదా అని కుమిలిపోతున్నాడు. స్కూలు వరండాలో కెళ్లాడు.

"నే నిక్కణ్ణుంచి కదలను" అనుకొని స్తంభానికి జేరబడ్డాడు. "నే నింటికే వెళ్లను" అని నిశ్చయించుకొన్నాడు.

నాలుగోక్లాసు దగ్గరి నుంచి బడిలో తను చదివిన ఐదేళ్ల సంగతులూ ఒక్కొక్కటే జ్ఞప్తికి వొచ్చాయి. ఐదవ క్లాసు చదువుతుండగా ఒక పిల్లాడు కృష్ణుడు మీద మేష్టరుతో చాడీలు చెప్పేడు. మేష్టరు నమ్మక, అబద్దాలు చెప్పేడని వాణ్ణే చితకతన్నేడు. మూడవఫారంలో తెలుగు మాష్టరు " గాంధారపతి " అంటే అర్థం చెప్పమన్నాడు.

అంతా నేల చూసి, ఇంటి కప్పు చూసి, ధృతరాష్ట్రుడని చెప్పేరు. తనొక్కడే "గాంధార దేశపు రాజు" అని చెప్పేడు. రెండవఫారం చదువుతుండగా దసరా తర్వాత ఒక కుర్రవాడు బడికి రావడం మానేశాడు. వాడి పేరు రోజూ పిలిచి మేష్టరు అబ్సెంటు వేస్తూ ఉండేవాడు. ఆఖరికి వాడు చదువు మానేశాడని తెలిసింది. ఆవేళ అటెండెన్సు రిజిష్టరులో వాడి పేరు కొట్టేసి, మేష్టరు "డిస్కంటిన్యూడ్" అని రాసి, ఇంగ్లీషు మాటకి అర్థం క్లాసులో చెప్పాడు. ఆనాటి నుండి కృష్ణుడు "డిస్కంటిన్యూ" అన్నమాటకు అర్థం మరిచిపోలేదు. ఆ పదం జ్ఞాపకం రాగానే అతనికి దు:ఖం పొర్లుకుంటూ వొచ్చింది.

"నే నింటికే వెళ్లను" అని పున:నిశ్చయించుకున్నాడు.

"నేను భోజనానికి వెళ్లను" అనుకున్నాడు.

అతని మొహం గాలికొట్టిన కొత్త ఫుట్‌బాలులాగ దు:ఖంలో పొంగి కందగడ్డ అయిపోయింది. ముక్కు నీటితో బరువెక్కి దిబ్బదేసిపోయింది. ముక్కు ఎగబీల్చుకుంటూ పొంగుకొస్తున్న దు:ఖానికి ఆనకట్టలు కట్టి దిగమింగుతూ స్తంభానికి జేరబడి పోయాడు. మొదటి పీరియడైపోయింది. కృష్ణుడు కదలలేదు. వాళ్ల నాన్న బజారుకి బయలుదేరేడు. వరండాలో కొడుకుని చూశాడు.

"ఓరి వెధవా! చుట్టలు తెమ్మంటే ఇక్కడ దిగమారేవేం?" అన్నాడు.

"చూడు!" అన్నాడు కృష్ణుడు.

"ఏమిట్రా చూడ్డం?" అన్నాడు తండ్రి.

"పాపం, కనబడదు!"

"ఏమిటిరా నీ శ్రాద్ధం?"

"నా శ్రాద్ధమే!"

"ఏమిటిరా!"

"వాళ్ళంతా బడికెళ్లారు!"

అప్పుడు తండ్రికి కొడుకు మొహంలో విచార రేఖలన్నీ కనబడ్డాయి.

"వెర్రి నాగమ్మా. అదిరా!" అన్నాడు. కృష్ణుడికి ఆనకట్టలు తెగ్గొట్టుకుని దు:ఖం కొట్టుకొచ్చింది. వెక్కివెక్కి చుట్టుకుపోతూ ఏడుపు మొదలెట్టేడు. కొడుకు బాధంతా తండ్రికి బోధపడ్డాది.కొడుకు బాధంతా తండ్రి పడ్డాడు.

"చదువు మానిపించానని అంత బాధపడుతున్నావా? బడి వరండాలు పట్టుకుని దేవుల్లాడుతున్నావా నాయనా? పద ఇంటికి!" అన్నాడు.

"నే(నాను!" అని భూమి బద్దలైపోయినంత గట్టిగా అరిచేడు.

"ఏం చేస్తావురా?"

"గోడకేసి బుర్ర బద్దలుకొట్టుకొంటాను!" అని ఇంకా గట్టిగా అరిచేడు. అంతపనీ చేస్తాడేమోనని వెళ్లి తండ్రి కౌగిలించుకొన్నాడు.

"పద నాయనా, ఇంటికీ !" అన్నాడు.

"బడి నాది! అని గట్టిగా కేకేశాడు.

"నీదేనురా బాబూ!"

" బడిలోకి తీసికెళ్లు మరి".

"తల తాకట్టు పెట్టుకునేనా బళ్లో వేస్తాను, ఇంటికి పద."

"ఇప్పుడే వెయ్యి !"

"డబ్బు చూసి వేస్తాను."

"ఇంటికి వెళ్లి లేదంటావు."

"అన్ను రా!"

"ఐతే పుస్తకాలు ముందు కొను!"

"వెర్రి నాయనా! వాటికి మాత్రం డబ్బొద్దూ!"

'ఒక్క పుస్తకం కొనమన్నావు?"

"ఇంగ్లీషు పుస్తకం కొను."

"కొందాం, పద ఏడవకు నాయనా, నే చచ్చిపోయాను, ఏడవకు!" అన్నాడు తండ్రి. తండ్రి చెయ్యిని చంకలో పెట్టుకొని గిలగిల కొట్టుకుని ఏడుస్తూ బడిలో స్టోర్సుకి తోవతీశాడు.

తండ్రి దీర్ఘంగా ఆలోచించాడు. చుట్టలు మానేద్దామనుకొన్నాడు. ఎంత మానుదామనుకున్నా మానలేకపోతున్నాడు. చుట్టలు మానేస్తే కృష్ణుడి జీతానికి సరిపోతుంది! ఇంకో విధంగా పాలుపోలేదు. "ఇందాకా చుట్టలకిచ్చిన డబ్బులున్నయా, పారేశావా?" అనడిగేడు కొడుకుని.

"ప..ప్ప..ప్పారేలేదు. జేబులో ఉన్నాయి.... ఎందుకు పారేస్తాను నాన్నా ?" అన్నాడు కృష్ణుడు.

✦

దోసకాయ రొయ్యల పులుసు

కావాల్సిన పదార్థాలు

దోసకాయ- ఒకటి, రొయ్యలు- పావు కిలో, ఉల్లిపాయలు-రెండు, అల్లం వెల్లుల్లి ముద్ద- ఒక టీ స్పూను, ధనియాల పొడి- ఒక టీ స్పూను, జీలకర్ర పొడి- అర టీ స్పూను, గరం మసాలా- ఒక టీ స్పూను, కారం- ఒక టీ స్పూను, పచ్చి మిరపకాయలు- మూడు, పసుపు- చిటికెడు, ఉప్పు- తగినంత, నూనె- సరిపడా, కొత్తిమీర- ఒక కట్ట

తయారీ

దోసకాయని తొక్క తీసి చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. రొయ్యలు పొట్టుతీసి పక్కన పెట్టుకోవాలి. మిక్సీ గిన్నెలో ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి ముద్ద వేసి రుబ్బుకోవాలి. పొయ్యి మీద గిన్నె పెట్టి సరిపడా నూనె పోసి కాగాక ఉల్లిపాయ గుజ్జు, కారం, పసుపు, ఉప్పు, ధనియాల పొడి వేసి వేగించాలి. ఇది బాగా వేగిన తర్వాత రొయ్యలు కూడా వేసి మరో పదినిమిషాలు సన్నమంటపై వేగించాలి. రొయ్యలు వేగిన తర్వాత దోసకాయ ముక్కలు గరం మసాలా, కొద్దిగా నీళ్లు పోసి ఉడికించాలి. దించేముందు కొత్తిమీర తురుము వేసుకోవాలి.

మసాలా కూర

కావాల్సిన పదార్థాలు

రొయ్యలు- అర కేజీ, అల్లం వెల్లుల్లి పేస్టు- పావు చెంచా, గరం మసాలా- పావు చెంచా, ధనియాల పొడి- రెండు చెంచాలు, కొబ్బరి పొడి- చెంచా, ఉప్పు- తగినంత, పసుపు- ముప్పావు చెంచా, నూనె- రెండు టేబుల్ స్పూన్లు, కరివేపాకు రెబ్బలు- రెండు మూడు, కొత్తిమీర తరుగు- కొద్దిగా, నిమ్మకాయ - ఒకటి, ధనియాలు- అర చెంచా,ఉల్లిపాయలు- రెండు, పచ్చిమిర్చి- రెండు, టొమాటో- ఒకటి, కారం- చెంచా

తయారీ

ముందుగా రొయ్యల్లో అర చెంచా పసుపు, ఉప్పు వేసుకుని శుభ్రం చేసుకోవాలి. తరువాత ఐదు నిమిషాలు నీళ్లల్లో ఉడికించి తరువాత రొయ్యల్ని గట్టిగా పిండి నీటిని తీసేయాలి. రొయ్యల్ని ఓ గిన్నెలోకి తీసుకుని మిగిలిన పసుపు, కారం, ధనియాల పొడి, గరం మసాలా, కొబ్బరిపొడి, అల్లం వెల్లుల్లి పేస్టు, ఒక ఉల్లిపాయ తరుగు, మూడు చెంచాల నూనె వేసి బాగా కలపాలి. ఇందులో కప్పు నీళ్లు పోసి, పొయ్యిమీద పెట్టాలి. ఐదు నిమిషాల తరువాత బాణలిలో మిగిలిన నూనె వేడిచేసి ధనియాలు, ఉల్లిపాయ ముక్కలు, పచ్చి రొయ్యల్ని కూడా వేసి వేయించుకోవాలి. సన్నని మంటపై వేయిస్తే తడిపోయి రొయ్యలు బాగా వేగుతాయి. అప్పుడు దించేయాలి.

రొయ్యలు మునక్కాయ

కావాల్సిన పదార్థాలు

రొయ్యలు- అర కిలో, మునక్కాయలు- రెండు, ఉల్లిపాయలు- మూడు, అల్లం వెల్లుల్లి ముద్ద- ఒక టేబుల్ స్పూను, గరం మసాలా- ఒక టీ స్పూను, జీలకర్ర- అర టీ స్పూను, ధనియాలు- ఒక టీ స్పూను, కారం- రెండు టీ స్పూన్లు, పసుపు- చిటికెడు, కరివేపాకు- రెండు రెబ్బలు, కొత్తిమీర- ఒకకట్ట, ఉప్పు- తగినంత, నూనె- సరిపడా

తయారీ

ముందుగా రొయ్యల్ని శుభ్రంగా కడిగి నూనెలో వేయించుకోవాలి. మునక్కాడలు నచ్చిన సైజులో కట్ చేసుకోవాలి. ఉల్లిపాయ ముక్కల్లో అల్లం వెల్లుల్లి ముద్ద, కొద్దిగా జీలకర్ర, ధనియాలు వేసుకుని మెత్తగా రుబ్బుకోవాలి, స్టౌ మీద గిన్నె పెట్టి సరిపడా నూనె పోసి వేడెక్కాక కరివేపాకు ఉల్లిపాయ ముద్ద వేసి వేగించాలి. ఉప్పు, కారం, పసుపు కూడా వేసి బాగా కలపాలి. బాగా వేగాక ములక్కాడ ముక్కలు వేసి రెండు నిమిషాలు వేగించాలి. తరువాత వేగించి పెట్టుకున్న రొయ్యలు వేసి కలపాలి. కొద్దిగా నీళ్ళు పోసి గరం మసాలా వేసి మూత పెట్టాలి. ఐదు నిమిషాల తరువాత వేగించి పెట్టుకున్న రొయ్యలు వేసి కలపాలి. కొద్దిగా నీళ్లు పోసి గరం మసాలా వేసి మూత పెట్టాలి. ఐదు నిమిషాల తరువాత బాగా కలిపి సన్నని మంటపై మరో పది నిమిషాలు మగ్గనివ్వాలి. చివర్లో కొత్తిమీర తురుము వేసి దింపేయాలి. మునక్కాయల కూర తయారయినట్టే.

రొయ్యల పచ్చడి

కావాల్సిన పదార్థాలు

రొయ్యలు- ఒక కిలో, కారం- 200 గ్రాములు, వెల్లుల్లి- 100 గ్రాములు, ఉప్పు- ఆరు టీ స్పూన్లు, జీలకర్ర- 75 గ్రాములు, మసాలా పొడి- నాలుగు టీ స్పూన్లు, నూనె- 350 గ్రా. నుండి 500 గ్రా. కరివేపాకు- తగినంత

తయారీ

రొయ్యలు ఒలిచి పప్పును అయిదు నిమిషాల పాటు ఉడకబెట్టాలి. తర్వాత నూనె పోసి ఉడికిన రొయ్యలను దోరగా వేయించాలి. మసాలాలు నిమ్మరసం లేదా నిమ్మ ఉప్పు ఒక గిన్నెలో కలిపి వేయించిన రొయ్యలను వాటిలో వేసి కలియబెట్టాలి. సరిపడా మసాలా దినుసులు వేసి పచ్చి నూనె పోసి కలిపి నిల్వ చేసుకోవాలి.

సామెత

రోలు పోయి మద్దెలతో మొర పెట్టుకున్నట్టు

రోలు మద్దెల దగ్గరకు వెళ్లి తన వొళ్లు హూనం చేస్తున్నారని మొర పెట్టుకుంటే 'ఇంకా నయం. నిన్ను ఒక వైపే వాయిస్తున్నారు. నన్ను రెండు వైపులా హూనం చేస్తున్నారు' అందట. అంటే... కష్టాల్లో వున్నవారు తమకంటే ఎక్కువ కష్టాల్లో వున్నవారి దగ్గరకు వెళ్లి చెప్పుకున్నప్పుడు ... ఈ సామెతను వాడుతుంటారు.

బుజ్జి స్టార్

హాయ్ ఫ్రెండ్స్! నేను తెలుగు సినిమా హీరోయిన్ ని . ఇది నా చిన్ననాటి ఫోటో..నేనెవరో కనిపెట్టి చెప్పండి.!

దారి కనిపెట్టండి





తేడాలు గుర్తించండి

ఈ రెండు జంతువుల మధ్య 5 తేడాలు ఉన్నాయి.వాటిని గుర్తించండి.

ఏ రంగు కళ్లు?

నువ్వు బస్సు నడుపుతున్నావు. నల్గురు ఎక్కారు. ముగ్గురు దిగారు. తర్వాత ఎనిమిది మంది ఎక్కారు. పది మంది దిగారు. తర్వాత ఆరుగురు ఎక్కారు. మరో ఇద్దరు దిగారు. ఇంతకీ బస్సు డ్రైవర్ కళ్లు ఏ రంగులో వున్నాయి?

జవాబులు: **ఏ రంగు కళ్లు?** నీ కళ్ల ఏ రంగులో వుంటాయో అవే రంగులో వుంటాయి. ఎందుకంటే బస్సు నడుపుతోంది నువ్వే కనక.
ఎన్ని జంతువులున్నాయి : ఎలుగుబంటి, పులి, గుర్రం, నక్క, డేగ. ఇవికాక అమ్మాయి కూడా వుంది.

ఎక్కడున్నాయి?

ఈ బొమ్మలో 21 బొమ్మలు దాక్కున్నాయి. వాటిని చూసి చకచకా గుర్తించండే.

ఎన్ని జంతువులు వున్నాయి?

ఈ బొమ్మలో కొన్ని జంతువులు దాక్కున్నాయి. మీరు పరిశీలించి అవి ఎన్ని? వాటి పేర్లు ఏంటో చెప్పాలి.

తాతయ్య కట్టిన చెట్టు ఇల్లు

తన ముద్దుల మనవడు, మనవరాలి కోసం ఓ తాతయ్య ఇల్లు కట్టాడు. అందులో కొత్త ఏముంది? అనుకోవచ్చు. అయితే తాతయ్య కట్టిన ఇల్లు అలాంటి ఇలాంటిది కాదు. చెట్టు ఇల్లు. మూడు అంతస్థుల మేడ. 40 అడుగుల పొడవు వుంటుంది. చూశారుగా! పై అంతస్తు నుంచి కిందికి రావడానికి మెట్లు మాత్రమే కాదు. జారుడు బల్ల కూడా పెట్టించాడు. ఎంచక్కా జారుతూ వచ్చేయొచ్చు. మసాచుసెట్స్‌కు చెందిన ఈ తాతయ్య చిన్నప్పుడు చెట్టు మీద ప్లైవుడ్‌తో కట్టిన చిన్ని ఇంటిలో బాగా ఆడుకున్నాడట. తన ముని సంతానం కూడా అలా ఆనందించాలన్నది ఆయన కోరిక. అందుకే కట్టేశాడు. ఎంతైనా కార్పెంటర్ కదా. అనుకున్న వెంటనే కట్టేశాడు. ఇంతకీ ఇల్లు బావుందా పిల్లలూ!

విద్యార్థి ఉపాధ్యాయుల కరదీపిక

"దేశ భక్తి అనే విషయం పాఠ్యాంశంలో భాగంగా లేకపోతే మన దేశం ఈ తరాన్నే గాదు భావి తరాన్ని కూడా కోల్పోతుంది. భావి పౌరులు దేశ శ్రేయస్సు కంటే తమ శ్రేయస్సుకే ప్రాధాన్యత ఇస్తారు. ప్రముఖ పాత్రికేయులు, పత్రికా సంపాదకులైన ఖాసా సుబ్బారావు ఈ పుస్తకంలో పటాపంచలు చేసే వాస్తవాంశాలు, 8,9 తరగతులకు భౌతిక శాస్త్ర అంశాలు శివాజీ, టిప్పు సుల్తాన్, భగత్ సింగ్, మదర్ థెరిస్సా, సుందరయ్య లాంటి మహోన్నత వ్యక్తుల సేవ, కృషి ఈ గ్రంథంలో పిల్లలకు అర్థమయ్యేలా చెప్పారు రచయిత. దొంగతనాల్ని, మూఢనమ్మకాల్ని తేట తెల్లం చేస్తూ విశ్వవాతావరణం నుండి నరావతరణ వరకు రాసిన అంశాలు చాలా విలువైనవి. ఈ విశ్వం ఇప్పటికీ 1370 కోట్ల సంవత్సరాల క్రితం పుట్టిందని శాస్త్రజ్ఞులు అనేక పరిశోధనల ద్వారా నిర్ధారించారు. ఒక పెద్ద విస్ఫోటనంలో అతి చిన్నగా వున్న పదార్థం పేలి అందులో నుండి వెలువడిన సూక్ష్మాణువులు క్రమంగా నక్షత్రాలు, గెలాక్సీలుగా రూపొంది విపరీతమైన వేగంతో ప్రయాణిస్తుంటాయి. మనమున్నది పాలపుంత గెలాక్సీ లోనే (పేజీ 136), ఈభూమి 470 కోట్ల సంవత్సరాల క్రితం, ఈ భూమి అనే వేడి వాయువుల ముద్ద సూర్యుడి నుండి విడివడి సూర్యుని నుండి మండే వాయుగోళం లాగా విడిపోయిన భూమి కొంత కాలానికి చల్లబడింది. హైడ్రోజన్, ఆక్సిజన్ కలిపి నీరు ఏర్పడింది (పేజీ 139). నిర్జీవ పదార్థం నుండి 300 కోట్ల సంవత్సరాల నాటికి ప్రాథమిక జీవ పదార్థం ఏర్పడిందని శాస్త్రజ్ఞులు నిరూపించారు. ఇప్పటికి 250 కోట్ల సంవత్సరాల క్రితం ఏక కణ జీవులు క్రమంగా రెండు కణాల జీవులుగా, ఆ తర్వాత బహు కణ జీవులుగా పరిణామం చెందాయి (పేజీ 147). సుమారు ఆరు కోట్ల సంవత్సరాల క్రితం పాలిచ్చే జంతువులు అవతరించగా నాలుగు కోట్ల సంవత్సరాల క్రితం వానరాలు అవతరించాయి. రామాపితికస్ అనే ఒక జాతి కోతులుండేవి. అవి ఇప్పటికి 44 లక్షల సంవత్సరాల క్రితం మానవులుగా పరిణామం చెందాయి. సుమారు కోటి సంవత్సరాల క్రితం భూమిపై ఉత్తర ప్రాంతంలో మరో మంచు యుగం వచ్చింది. ఇలాంటివి ఎన్నో శాస్త్రీయ సైన్స్ అంశాలతో ఆద్యంతం ఈ పుస్తకంలో విలువైన సమాచారంతో కూడిన గొప్ప శాస్త్ర గ్రంథం.



దేశభక్తి
రచన: కె.ఎల్. కాంతారావు, పేజీలు: 152, వెల: 75/-,
ప్రతులకు: నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్, ఎమ్. హెచ్. భవన్- హైదరాబాద్.

- ప్రసన్న కుమారి

ఒక పుస్తకం రెండు పార్శ్వాలు

1978లో తొలి ముద్రణకు డా॥కె. గోపాల కృష్ణారావు ముందుమాట రాశారు. ఈ పుస్తకంలో లలిత గీతాలు- విరహ తాపాలు, వైరాగ్య భావాలు, జానపద బాణీలు, ఈ సరిగమల్లో సత్యనారాయణ పలికించారు. నీ నడక నాట్యంబు, కొండలనె కదిలించు, నీ పలుకు మధురంబు, రాతినే పలికించు, ఎందుకే నీ కనుల ఇంపైన సూపులు, ఎవరికే నీ వయసు సొంపైన బిగువులు అంటూ మధురా వేదన (పేజీ 11) ప్రియుడ్ని అలరిస్తుంది. అలాగే అనుబంధాల గీతంలో చివరి చరణాల్లో కవి ఎస్వీ ఇలా అంటారు. ఊహలన్నీ ఒకటి దారులన్నీ ఒకటి./ ఆలోచనలు మనవి ఒకటేనులే ఆవేదనలు మనవి ఒకటేనులే, ఏ నాటి ఈ బంధమో.. నిరీక్షణ (పేజీ:25), అన్నదాత (పేజీ:30), అడవి కాచిన వెన్నెల (పేజీ:40), ఆత్మరోదనం (పేజీ: 43), మర్దల్ పిల్ల (పేజీ: 59), అంబరాలే (పేజీ: 68), రాజన్నా రాజిగో (పేజీ: 87) పాటలు చాలా బాగున్నాయి. ఇక పదనిసల్లోని అభ్యుదయ గీతాలన్నీ ఆణిముత్యాలే! ఉషస్సంగీతం (పేజీ:5), ప్రజా కళాకారులకు స్వాగతం (పేజీ:7), అరుణారుణ వందనం (పేజీ:9), అరుణోదయ చిహ్నం (పేజీ:12), విప్లవ కిరణం (పేజీ:16), ఇది మహోదయం (పేజీ: 20), మేడే (పేజీ:22,) మా వాటా (పేజీ: 27), రావి నారాయణ రెడ్డి గారిపై రాసిన "ఎర్ర సేనాని ఆర్.ఎస్. పాట (పేజీ:32), చంద్ర రాజేశ్వర రావు గారి పై రాసిన "అక్షరాంజలి" పాటలు ఈ పుస్తకంలోనివే. విప్లవ హాస్యం (పేజీ: 55), అక్టోబరు విప్లవం (పేజీ:50), రణం మనదేరన్నా (పేజీ: 53), విశ్వశాంతి పాటలు చాలా బాగున్నాయి. వామపక్ష ఉద్యమ శ్రేణులకు పార్టీ సభల్లో ఈ విప్లవ అభ్యుదయ గేయాలు సభికుల్ని, కార్యకర్తల్ని విప్లవ కార్యాచరణకు కార్యార్థిని గావిస్తాయి. లలిత గీతాలు అభ్యుదయ గీతాల ఏక సంపుటిగా ఈ పుస్తకం బహుళ ప్రచార ప్రయోగకారి.

- తంగిరాల చక్రవర్తి



సరిగమలు-పదనిసలు, లలిత గీతాలు- అభ్యుదయ గీతాలు,
రచన: ఎస్వీ సత్యనారాయణ,
పేజీలు: 144, వెల: 100/-,
ప్రతులకు: నవ చేతన పబ్లిషింగ్ హౌస్, గిరి ప్రసాద్ భవన్, బండ్లగూడ, హైదరాబాద్.



సాధన సౌరభాలు
బాల వ్యక్తిత్వ వికాస వ్యాసాలు
రచన: శ్రీమతి. టి. శాంతాభాస్కర్
పేజీలు: 72/-
వెల: 100/-
ప్రతులకు: 3-422, పగడమాను వీధి గిరింపేట, చిత్తూరు



మనుషులపై మిర్చీలు
రచన: బత్తుల వీవీ అప్పారావు
పేజీలు: 67/-
వెల: 50/-
ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో.

జుట్టు..
రెండున్నర మీటర్లు..

పొడవాటి జటాజూటాలున్న బామ్మగా చైనాకు చెందిన గు మెయింగ్‌కు పేరొచ్చింది. వాటి పొడవు ఏకంగా రెండున్నర మీటర్లు. వాటితో ఆమె శరీరాన్ని మూడు సార్లు చుట్టొచ్చు. 35 ఏళ్లుగా కంటికి రెప్పలా కాపాడుకుంటూ పెంచుకున్న జుట్టు ఇది. 24 ఏళ్లున్నపుడు ఆమె జుట్టు మిగతా వారి కన్నా పొడుగ్గా, వేగంగా పెరగడంతో ప్రత్యేకంగా అనిపించేదామెకు. ఆ పొడవాటి జుట్టే తనకు గుర్తింపని తెలుసుకుని దాన్ని పెంచుతోంది. ఆ జుట్టును కత్తిరించి ఇస్తే అక్షరాలా లక్షన్నర రూపాయలు ఇస్తామని విగ్గుల కంపెనీలు సంప్రదించాయట. అయినా అమ్మలేదు. మరింతగా పెంచి గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించాలన్నది ఆమె ఆలోచన. పేరుకు పేరు. డబ్బుకు డబ్బు.

పలు పంటలలో పొందండి అధిక దిగుబడులను

జైన్ డ్రిప్ మరియు స్ప్రింక్లర్లను వాడండి

శుభప్రదమైన దీపావళి
మీ జీవితాలను అనంతమైన
ఆనందంతో నింపాలని
కోరుకుంటూ
పాఠకులకు, వినియోగదారులకు
మీకు, మీ కుటుంబ సభ్యులకు
జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్
వారి తరుపున

దీపావళి శుభాకాంక్షలు

జైన్®
జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్

1-1-782/బి/5, పార్క్ ఎదురుగా, గాంధీనగర్, హైదరాబాద్ - 80,
ఫోన్ : 040-2761 4474, 24654681, 9440797846.
Email : jainhyderabad@jains.com,
Website : www.jains.com

వీధి ముఖ చిత్రం

వెలుగులతో ఆకట్టుకునేది కాదు.. వెలుగునిచ్చేదే సిసలైన కళ అంటాడు కాలిఫోర్నియాలోని శాంటా అనా వాసి బ్రియాన్ పీటర్సన్. ఓ ప్రఖ్యాత కార్ల కంపెనీలో డిజైనర్‌గా పని చేస్తున్న ఈయన 'లవ్ డజ్' అనే పుస్తకం చదివాడు. నీది నిజమైన ప్రేమే అయితే నీదంటూ అనుకుంటున్న కాలాన్ని త్యాగం చేసి నీ నైపుణ్యాలను ఎదుటి వారి కోసం ఉపయోగిస్తావనేదే దానిలోని సారాంశం అని గ్రహించాడు. సమాజానికి తన వంతు బాధ్యతగా ఏదో ఒకటి చేయాలనుకున్న బ్రియాన్ హృదయాన్ని వీధి బతుకులు మెలి పెట్టాయి. ఎపుడో ఏడేళ్ల క్రితం అటకెక్కించిన కుంచెను, రంగుల ప్యాలెట్‌ల దుమ్ము దులిపాడు. వీధుల్లో ఏకాకులుగా గడిపేస్తున్నవారి వద్దకు వెళ్లి వారి కన్నీళ్ల కథల్ని గుండెతో వినేవాడు. వారి భావోద్వేగాలను తదేకంగా వీక్షించేవాడు. ఎవరికీ పట్టని ఆ జీవితాల్లో ప్రపంచాన్నే పట్టించుకోని నిర్వేదాన్ని గమనించాడు. అంతేలేని లోతైన తాత్వికతను దర్శించాడు. ప్రాణ స్నేహానికి తీసిపోని దగ్గరితనాన్ని అనుభూతించాడు. వారి కథలు, వారి ఉద్వేగాలను ఒడిసిపట్టి వర్ణ ముఖచిత్రాలను సృజించి వాటిపై వారి సంతకాలు తీసుకుంటాడు. 'ది ఫేసెస్ ఆఫ్ శాంటా అనా' పేరిట వీధి గ్యాలరీలు ఏర్పాటు చేసి వాటిని మార్కెట్ చేస్తున్నాడు. వచ్చిన డబ్బులో మూడు వంతులు ఆ చిత్ర కథానాయకులకే ఇస్తాడు. ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను నిర్వహిస్తూ మరింత డబ్బు పోగయ్యేలా చేస్తున్నాడు. వీధుల పాలైన వారికి వీటితో కూడు, గూడు కల్పిస్తున్నాడు. బ్రియాన్ ప్రత్యేకతను గుర్తించిన కొన్ని సంస్థలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు సాయం చేస్తున్నాయి. ●



బియాన్
పీటర్సన్